VISALAANDHRA Phone 6376

ఉదయం

విశాలాంధ్ర

306680

* * Regd. No. H 293.

సంపుటి 17, సంచిక 283] విజయవాడ 24—1—1968 బుధవారం [6 పేజీలు 12 పై.

"విశాలాంధ్ర" చందా వివరాలు

దిన పత్రిక 12 పైసలు, ఆదివారం సంచిక 15 పైసలు

	ఏజెంటు ద్వారా		పోస్టు ద్వారా
సంవత్సరానికి	రు 44_00	....	రు 51 00
6 నెలలకు	రు 22_00	....	రు 25_50
3 నెలలకు	రు 11 25	....	రు 12 75
నెలకు	రు 3_75	....	రు. 4_25

పోలీసు రక్షణకు మద్రాసు సాంస్కృతిక బృందం అభ్యర్థన

న్యూఢిల్లీ జనవరి 23

ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ సాంస్కృతికోత్సవాలలో పాల్గొనడానికి వచ్చిన మద్రాసు సాంస్కృతిక బృంద సభ్యులకు పోలీసు రక్షణ యివ్వవలసిందిగా అధికారులకు విజ్ఞప్తిచేశారు.

ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ 11వ మహాసభలో 21వ తేదీన భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు ప్రసంగిస్తున్న దృశ్యం

రాష్ట్ర ఉద్యోగుల పోరాటానికి కమ్యూనిస్టుపార్టీ అండదండలు

కేంద్రంతో సమానంగా వారికి డి.ఎ. ఇవ్వాలని ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ మహాసభ డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు తీవ్ర నిరసన

[illegible] (ఏలూరు) జనవరి 23

పెరిగిన ధరల కనుగుణంగా కేంద్రం తన ఉద్యోగులకు మంజూరుచేసిన కరువుభత్యాన్ని తమకుకూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు జరుపుతున్న ఆందోళనోద్యమం పట్ల సంపూర్ణ సౌహార్దతను ప్రకటిస్తూ ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ 11 వ మహాసభ నేడు తీర్మానించింది

శ్రీ కె. ఎల్. మహేంద్ర ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు.

మహాసభ ఆమోదించిన తీర్మానం ఇలా వుంది.

జీతాలు, పని పరిస్థితుల మెరుగుకోసం ఉపాధ్యాయ సంఘాలు సవరించిన రీతిగా కొఠారి కమిషన్ సిఫారసుల అమలు కోసం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సరిసమానంగా 30 పాయింట్ల కరువు భత్యం కోసం, రిట్రెంచి చేసిన సిబ్బంది నంతటిని తిరిగి పనిలోకి చేర్చుకొనడం కోసం, రిటైర్మెంటు వయస్సు తగ్గించడం వగైరాల అనేక పద్ధతుల ద్వారా రిట్రెంచ్ చేయాలన్న ప్రతిపాదనలను ఉపసంహరింపజేయడం కోసం, విద్యా సాంఘిక సంక్షేమ తదితర అభివృద్ధి పథకాలలో పెట్టిన కోతలను పునరుద్ధరింపజేయడం కోసం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పరిశ్రమల్లోని ఉద్యోగులు చేస్తున్న ఆందోళనను భారత కమ్యూనిస్టుపార్టీ ఆంధ్ర ప్రదేశ్ సమితి పదకొండవ మహాసభ సంపూర్ణంగా బలపరుస్తున్నది.

కేంద్ర ఉద్యోగులతో సరిసమానంగా 30 పాయింట్ల కరువుభత్యాన్ని ఇవ్వ నిరాకరిస్తూ కేవలం 20 పాయింట్ల కరువుభత్యాన్ని మాత్రమే అదైన 1-1-68 నుండి మాత్రమే ఇచ్చి అందులో సగం [illegible] కలపడానికి నిర్ణయించడం ద్వారా ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయాన్ని తిరస్కరిస్తోంది. కనీసం ఎరుగని రీతిగా ధరలు పెరుగుతున్న ఈ దశలో కరువుభత్యాన్ని తిరస్కరించడం, ఆ యిచ్చే కొద్దిమొత్తాన్నయినా వాయిదా వేయడం సహించరాని దుర్న్యాయం.

నిధులు చాలవని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వాదన తన ఆర్థిక విధానాలను మార్చుకొనడానికి తిరస్కరించడం తప్ప మరొకటి కాదు. రాష్ట్ర ఉద్యోగులను పెరుగుతున్న ధరల మహమ్మారికి బలి చేస్తున్నది

కేంద్ర ప్రభుత్వం వనరుల నన్నింటినీ తానే వొత్తి రాష్ట్రాలను మాడుస్తున్నది [illegible] రాష్ట్రంలాంటి వెనుకబడ్డ రాష్ట్రాలపట్ల ప్రత్యేక శ్రద్ధచూపి అవసరపు నిధులను కేటాయించవలసి వుంది.

కేంద్ర ప్రభుత్వం అడుగులకు మడుగు లొత్తుతూ తమకు నిధులు లేవని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వాదనలను కమ్యూనిస్టుపార్టీ తిరస్కరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడలేకపోతున్నది. స్వార్థపరులైన భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు తల వొగ్గుతూ వనరులను సేకరించలేకపోతున్నది

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయసమ్మత కోర్కెలను అంగీకరించి అమలు జరపాలని కమ్యూనిస్టుపార్టీ డిమాండు చేస్తున్నది. ఈ కోర్కెల సాధనకోసం ప్రభుత్వ ఉద్యోగులూ ఇతర ప్రజాస్వామిక శక్తులూ చేసే పోరాటాల నన్నింటిని కమ్యూనిస్టుపార్టీ పూర్తిగా బలపరుస్తున్నది

నూతన రైలు మార్గాల నిర్మాణానికి డిమాండ్

ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామిక వృద్ధికి దోహదం చేయడానికి నూతన రైలుమార్గాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానించింది.

ఆ తీర్మానం ఇలావుంది:

ఆంధ్ర ప్రదేశ్ లో జల ఖనిజ అటవీ మొదలగు సహజ సంపదలు, వ్యాపార పంటలు పుష్కలంగా వున్నా రవాణా సౌకర్యాల లోపంవల్ల ఆంధ్ర ప్రదేశ్ ఆర్థికాభి

(మిగతా 5 వ పేజీలో)

మద్రాస్ శాసనసభ సమావేశం ప్రారంభం

భాషా సమస్యపై చర్చ

మద్రాసు జనవరి 23

భాషా సమస్యను గురించి చర్చించడానికి మద్రాసు శాసనసభ అత్యవసర సమావేశం నేడు ప్రారంభమైంది

అధికార భాషల (సవరణ) చట్టం ఆమోదం దానికి సంబంధించి పార్లమెంటు తీర్మానం ఫలితంగా రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర పరిస్థితిని చర్చించడానికిగాను ఈ సమావేశం జరుగుతున్నది

విద్యామంత్రి శ్రీ వి ఆర్ నెడుంచెళియన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు

అధికార పార్టీయైన ద్రవిడమున్నేట్ర కళగం, ఇతర పార్టీలు కాంగ్రెసు కమ్యూనిస్టులు, స్వతంత్ర ముస్లింలీగ్, యస్ యస్ పి, తమిళ అరసుకళగం ప్రతినిధులు 5 సవరణలను ప్రవేశపెట్టారు.

త్రిభాషా సూత్రం స్థానంలో ద్విభాషా సూత్రాన్ని అమలు జరపాలని డి. యం కె అధికార సవరణను శ్రీ అన్నాదొరై ప్రతిపాదించారు

14 ప్రాంతీయ భాషలకు సమాన ప్రతిపత్తి కలిగించడానికి రాజ్యాంగానికి అనువైన సవరణలు చేయాలని కోరారు

అధికార భాషల (సవరణ) చట్టం, తత్సంబంధమైన తీర్మానం ఫలితంగా దేశ విభజన జరుగుతుందని [illegible] కాలంలో అల్లకల్లోలానికి దారితీస్తుందని ఆ సవరణలో తెలిపారు

పత్రికా ఉద్యోగుల దేశవ్యాపిత నిరసనసమ్మె నేడే

పోరాటంపట్ల సర్వత్రా సంఘీభావం

బొంబాయి జనవరి 22

జాతీయ ఔన్నత్యానికి, వికాసానికి, ప్రగతికి పాటుపడవలసిన పత్రికల్ని తమ చేతులో పెట్టుకొని, అపారలాభాలు ఆర్జించుతూ, పత్రికల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, పాత్రికేయులకు కనీసంగా యివ్వాల్సిన వేతనాలను యివ్వటానికి నిరాకరిస్తున్న గుత్తపెట్టుబడిదార్ల పొగరుబోతు వైఖరికి అసమ్మతిగా నేడు (జనవరి 24) దేశ వ్యాపితంగా పత్రికా రంగంలోని పని వారంతా పాత్రికేయులతో సహా సమ్మె చేయబోతున్నారు

వేతనాలబోర్డు సిఫారసులను అమలు జరపాలనే కోర్కె సాధనకు ప్రదర్శనంగా దేశవ్యాపితంగా పత్రికా ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు

పత్రికా ఉద్యోగులతోపాటు ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా యు. యన్. ఐ. తదితర వార్తా సంస్థలలో పనిచేసే ఉద్యోగులు కూడా సమ్మెలో పాల్గొంటారు

24 వ తేదీన [illegible] టెలిప్రింటర్ మిషను అవసరం పి. టి. ఐ. మొదటిసారిగా పత్రికా కార్యాలయాలు ఈ రోజు మధ్యాహ్నం వార్తవంపించి నేటిరాత్రి 12 గంటలనుండి పి టి ఐ. ఉద్యోగులు సమ్మెచేస్తున్నారు

ఈ సమ్మె పర్యవసానంగా 25 వ తేదీ పత్రికలు ఏవీ వెలువడవు. పట్టుదలకోసం ఒకవేళ ఏ పత్రిక యజమాని అయినా పత్రిక అచ్చువేసినా మామూలుగా ఉండే పేజీలు, వార్తలు ఉండటం అసంభవం

ఈ సమ్మె పట్ల దేశంలోని కార్మికసంఘాలు ప్రముఖులు అభ్యుదయశక్తులన్నీ సంఘీభావాన్ని వ్యక్తంచేస్తున్నాయి

శ్రీ మిరాజ్ కర్ సంఘీభావం

దేశ వ్యాపితంగా జరగనున్న వార్తా పత్రిక ఉద్యోగుల సమ్మెను తాను హృదయపూర్వకంగా బలపరుస్తున్నానని అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ యస్ యస్. మిరాజ్ కర్ నేడు ఒక ప్రకటన చేశారు.

పత్రికా యజమానుల వర్గం వైఖరిని ఆయన తన ప్రకటనలో ఖండించారు.

పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ లక్ష్మణసింగ్ గిల్ నేడొక ప్రకటనలో పత్రికా ఉద్యోగుల సమ్మెను హృదయపూర్వకంగా బలపరుస్తున్నానని తెలిపారు

పంజాబ్ హర్యానా రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖులకుపైగా ఒక సంయుక్త ప్రకటన చేస్తూ జనవరి 24 న పత్రికా ఉద్యోగులు సాగిస్తున్న సమ్మెను బలపరుస్తున్నామని తెలిపారు.

ఈ ప్రకటనపై రాజకీయ నాయకులు, న్యాయవాదులు, శాసనసభ్యులు కార్మికనాయకులు సంతకాలు చేశారు వీరిలో పంజాబ్ ఆర్థికమంత్రి డా॥ జగజిత్ సింగ్ పంజాబ్, హర్యానాల మాజీ ముఖ్యమంత్రులు శ్రీయుతులు గుర్నాంసింగ్, రావు బీరేంద్రసింగ్ లు ఉన్నారు

శ్రీ కులకర్ణి ప్రకటన

ప్రభుత్వం ఆమోదించిన వేజ్ బోర్డు సిఫార్సులను పత్రికా యజమానులు అమలు జరపాలని ఉద్యోగులు చేస్తున్న ఆందోళన న్యాయసమ్మతమైనదని అఖిల భారత రేవు కార్మికులసమాఖ్య అధ్యక్షులు శ్రీ యస్ ఆర్ కులకర్ణి నేడు బొంబాయిలో ఒకపత్రికా ప్రకటనలో తెలిపారు

రేపు జరిగే సమ్మెకు వేలాదిగా ఉన్న రేవు కార్మికుల సంఘీభావం ఉంటుందని ఆయన అన్నారు

వేజ్ బోర్డు సిఫార్సులను వెంటనే అమలుజరిపించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధానికి, కేంద్ర కార్మిక మంత్రికి ఆయన టెలిగ్రాంలు పంపారు.

పత్రికా యజమానుల సంఘం కార్మిక వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నదని ఆయన చెప్పారు

ఈ సిఫార్సులను అమలు జరిపించడానికి ప్రభుత్వం అసాధారణమైన అధికారాలను ఉపయోగించాలని, అవసరమైతే తగిన ఆర్డినెన్సు జారీ చేయవలసిందిగా రాష్ట్రపతికి సిఫార్సు చేయాలని ఆయన అన్నారు

వార్తా పత్రికల ఉద్యోగుల ఆధ్వర్యాన నేటి రాత్రి బొంబాయిలో జరిగిన బహిరంగ

(మిగతా 2 వ పేజీలో)

ఎ. పి. టి. యు. సి. సంఘీభావం: శ్రీ సత్యనారాయణరెడ్డి ప్రకటన

ఏలూరు, జనవరి 23

కేంద్ర ఉద్యోగులతో సమంగా కరువుభత్యం సాధనకై రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు, ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలలోని కార్మికులు జరుపుతున్న పోరాటంపట్ల సౌహార్దతను ప్రకటిస్తూ ఎ. పి. టి యు సి ప్రధానకార్యదర్శి శ్రీ యస్ సత్యనారాయణరెడ్డి నేడొక ప్రకటన చేశారు.

జీవితావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి, చాలీచాలని జీతాలతో ఉద్యోగులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆయన అన్నారు

జీవన వ్యయసూచీ పెరుగుదల కనుగుణ్యంగా కరువుభత్యం ఇవ్వజాలమని రాష్ట్ర ప్రభుత్వ ధోరణిని ఆయన తీవ్రంగా విమర్శించారు

రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల న్యాయసమ్మతమైన ఆందోళనకు పూర్తి మద్దతును ప్రకటించారు

శ్యామసుందరరావు విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 23

రాష్ట్రంలోని 4 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు ఈనెల 24 వ తేదీన రాష్ట్ర వ్యాపితంగా నిరసన ప్రదర్శన జరుపుతారు

నల్ల బ్యాడ్జీలు ధరించి ఆఫీసు కార్యక్రమాల్లో ఈ ఉద్యోగులు పాల్గొని విరామసమయంలో తమ తమ ఆఫీసులలో నిరసన ప్రదర్శనలు జరుపుతారు.

సాయంత్రం జంట నగరాల్లోనూ, వివిధ జిల్లా తాలూకా సమితి కేంద్రాలలోను పెద్ద ఎత్తున ఊరేగింపులు, బహిరంగ సభలు ఏర్పాటు చేస్తారు.

ఈ సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం మొనర్చాలని ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ శ్రీ ఎ. శ్యామసుందరరావు ఒక ప్రకటనచేస్తూ తెలంగాణా ఎన్ జి ఓ యూనియన్ ప్రకటనల ననుసరించి ఉద్యోగులు తప్పుదారి పట్టవద్దని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం వహించేదిగావున్న ఐక్యకార్యాచరణ ఆదేశాలను గౌరవించి తెలంగాణా ఎన్ జి ఓ సంఘ [illegible] ప్రతిఘటించి ఐక్యకార్యాచరణకు పూనుకోవాలని ఆయన అన్నారు.

నిరసన ప్రదర్శనలో పాల్గొని 1968 ఫిబ్రవరి 6 వ తేదీన జరిగే సమ్మెలో పాల్గొనాలని ఆయన తెలంగాణా ప్రభుత్వ ఉద్యోగులను కోరారు.

బెంగుళూరులో

పోలీసు కాల్పుల్లో 5 ప్రాణాలు బలి

విషమించిన హిందీ వ్యతిరేక ఆందోళన

బెంగుళూరు జనవరి 23

బెంగుళూరులో హిందీ వ్యతిరేక ఉద్యమం విషమరూప ధరించింది పోలీసు కాల్పుల్లో 5 గురు మృతి చెందినట్లు విశ్వసించబడుతున్నది అయితే ఇద్దరే మరణించినట్లు ముగ్గురు గాయపడినట్లు పోలీసు అధికారులు ధృవీకరించారు

కాల్పుల్లో గాయపడిన నలుగురిని ఆస్పత్రిలో చేర్చారు అందులో ఒక వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా వున్నది

8 పర్యాయాలు కాల్పులు జరిపారని డిప్యూటీ పోలీసు కమిషనర్ చెప్పారు.

విద్యార్థులు వాహనాలపై రాళ్లు విసరగా ఒక పోలీసు జీపును తగుల బెట్టారని చెప్పబడుతున్నది.

విద్యాసంస్థల మూసివేత

ఆందోళన పర్యవసానంగా నగరంలోని ప్రాథమిక మాధ్యమిక హైస్కూళ్ళు అన్నింటిని జనవరి 9 వరకు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

సెలవు

పాత్రికేయుల, పాత్రికేయేతరుల వేతన బోర్డు సిఫార్సులను పత్రికా యజమానులు అమలుజరప నిరాకరిస్తున్నందుకు నిరసనగా పత్రికాసిబ్బంది ఈ నెల 24 వ సమ్మెచేయవలసిందిగా అఖిల భారత పత్రికా ఉద్యోగుల సమాఖ్య పిలుపు యిచ్చింది. ఆ పిలుపు పట్ల సంఘీభావ సూచకంగా 'విశాలాంధ్ర' పత్రికకు 24 వ తేదీన సెలవు ప్రకటిస్తున్నాం. గనుక, 25 వ తేదీ పత్రిక [illegible]. జనవరి 26 వ తేదీ [illegible].

మేనేజరు

—'విశాలాంధ్ర'

హైడ్రోజన్ బాంబులున్న అమెరికా విమానానికి ప్రమాదం

—గ్రీన్ లాండ్ లో దుర్ఘటన

వాషింగ్టన్ జనవరి 22

హైడ్రోజన్ బాంబులు తీసుకువెళ్తున్న బి 52 నమూనా బాంబర్ విమానం నిన్న గ్రీన్ లాండ్ లో కూలిందని అమెరికా సైనికశాఖ ప్రకటించింది.

బాంబులు పేలలేదని, అందువల్ల అణ్వాయుధ ప్రేలుడు ప్రమాదం ఏదీ సంభవించలేదని ఈ ప్రకటన తెలిపింది.

విమానం కూలే సమయంలో దానిలోని చోదకుల్లో 5 గురు పారాచూట్లతో క్రిందికి దూకగా దూకినవారిలో ముగ్గురు బ్రతికారు.

తులె విమాన స్థావరానికి 7 మైళ్ళలో ఈ విమానం కూలింది

విమానం అత్యవసరంగా క్రిందికి దిగబోతుండగా ఈ ప్రమాదం జరిగినది

కూలేటప్పుడు ఈ విమానంలో నాల్గు హైడ్రోజన్ బాంబు లున్నాయని అమెరికా రక్షణశాఖ ప్రకటించింది.

కాంబోడియాలోకి అమెరికా సైన్యాల ప్రవేశం యథార్థమే

వాషింగ్టన్ ఒప్పుకోలు

వాషింగ్టన్, జనవరి 22

జనవరి 18వ తేదీన అమెరికా ప్రతినిధులు సైగాన్ ప్రభుత్వ గస్తీ దళాలు కాంబోడియా భూభాగంలోకి 75 గజాల వరకు చొచ్చుకు వెళ్ళిన మాట వాస్తవమేనని, అమెరికా [illegible] ఈ రోజు ప్రకటించింది.

ప్రమాదవశాత్తు అలా జరిగిందని, కాంబోడియా పట్ల అమెరికాకు శత్రుత్వ వైఖరి లేదని అమెరికా అన్నది.

బస్సు ప్రమాదంలో 13 మంది మృతి

మెక్సికో వద్ద

మెక్సికో జనవరి 22

మెక్సికో కు వాయువ్యంగా 50 మైళ్ళ దూరంలోనున్న ఒక కొండపైనుండి ప్రయాణీకులతో క్రిక్కిరిసిన బస్సు గత ఆదివారం బోల్తా కొట్టడంవల్ల 12 మంది మరణించారు.

మరణించిన వారిలో 5 గురు పిల్లలు 8 మంది స్త్రీలు కలరు

68 మంది ప్రయాణీకులు పెంపుడు జంతువులు, సామానులను కలిగియున్న ఈ బస్సు బ్రేకులు పని చేయనందువల్ల దారి తప్పి పక్కనున్న ఒకరాతిగోడతో ఢీకొని ధ్వంసమైపోయింది. గాయపడిన 45 మందిని ఆస్పత్రిలో చేర్చారు.

దుర్గాపూర్ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వహణకు సైనికోద్యోగి

కేంద్రప్రభుత్వ ప్రతిపాదన

కలకత్తా జనవరి 22

దుర్గాపూర్ లోని పరిస్థితిదృష్ట్యా దుర్గాపూర్ ఉక్కు ఫ్యాక్టరీ బాధ్యతలను పూర్తిగా నిర్వహించడానికిగాను ఒక సీనియర్ సైనికోద్యోగిని నియమించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

దుర్గాపూర్ ఉక్కు ఫ్యాక్టరీలోని కార్మికుల పరిస్థితి భిలాయ్ రూర్కెలాలోకన్నా తీవ్రంగా ఉన్నదని ఉక్కు మంత్రిత్వశాఖ ప్రతినిధి తెలిపారు.

ఇందిరాగాంధీ, టిటోల చర్చలు: అంతర్జాతీయ రాజకీయ సమస్యలపై

న్యూఢిల్లీ జనవరి 23

భారత ప్రధాని ఇందిరాగాంధీ యుగోస్లావియా అధ్యక్షులు మార్షల్ టిటోల మధ్య నేటి ఉదయం రాష్ట్రపతి భవన్ లో రాజకీయ సంభాషణలు ప్రారంభం అయినాయి

వియత్నాం తదితర సమస్యలపై సుమారు 2 గంటలపాటు ఈ సంభాషణలు జరిగాయి

తర్వాత శ్రీమతి ఇందిరాగాంధి మార్షల్ టిటోకు విందు చేశారు.

నిన్న సాయంత్రం మార్షల్ టిటో కాంబోడియా నుంచి ఢిల్లీ చేరుకున్నారు ఈ రోజు ఏకాంతంగా ఇందిరాగాంధితో ఆయన చర్చలు జరుపుతారు.

ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ మహాసభ ముగింపు సందర్భంలో

25 వ తేదీ సాయంత్రం

ఏలూరు మున్సిపల్ హాయ్యర్ సెకండరీస్కూల్ ఆవరణలో

[తాలూకా ఆఫీసు వద్ద]

★ బహిరంగసభ ★

ఉపన్యాసకులు : శ్రీ యస్. ఎ. డాంగే,

శ్రీ నీలం రాజశేఖరరెడ్డి,

శ్రీ మఖ్దూం మొహియుద్దీన్,

శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ.

ఉపన్యాసానంతరం సాంస్కృతిక ప్రదర్శనలుంటాయి.

యు.పి.ఐక్యసంఘటననూతన నాయకుడుగా శ్రీ వికల్?

ఈ నెలాఖరులోగా శ్రీ చరణ్ సింగ్ తన విధానాన్ని మిగతా పక్షాలచేత ఒప్పించలేక పోయినట్లయితే

లక్నో జనవరి 22

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్ ఈ నెలాఖరులోగా అన్నివివాదాస్పద అంశాలమీద ఐక్యసంఘటనలోని వివిధ పక్షాలను సమాధానపర్చలేక పోయినట్లయితే శ్రీరామచంద్రవికల్ (ఇండిపెండెంట్)ను నూతననాయకుడిగా ఎన్నుకోవాలని నేటిరాత్రి జరిగిన సమన్వయసంఘం తీర్మానించింది

శ్రీ చరణ్‌సింగ్ పార్టీఐన భారతీయ క్రాంతిదళ్, కొంతమంది ఇండిపెండెంట్లు రిపబ్లికన్ పార్టీ వాకౌట్ జరిపిన అనంతరం ఈ తీర్మానం చేయబడింది

ఈ రోజు ఇక్కడ జరిగిన ఐక్య సంఘటన సమన్వయ సంఘ సమావేశం తీవ్ర వాగ్వివాదాల మధ్య, కోలాహాల మధ్య పరస్పర నిందారోపణల మధ్య జరిగింది రెండు పక్షాలు వాకౌట్ జరిపాయి

సంయుక్త సోషలిస్టుపార్టీ నాయకుడు శ్రీ రాజ్‌నారాయణ్‌కు, భారతీయ క్రాంతిదళ్ ప్రతినిధులకుమధ్య జరిగిన వాగ్వివాదాల అనంతరం బి. కె. డి. ప్రతినిధులు వాకౌట్ చేశారు.

శ్రీ రాజ్ నారాయణ్ ఉపయోగించిన 'తిట్ల'కు నిరసనగా తాము వాకౌట్ చేస్తున్నట్లు బి.కె.డి ప్రతినిధులు ప్రకటించారు

తరువాత ఇండిపెండెంట్ గ్రూపు సభ్యులు వాకౌట్ జరిపారు ముఖ్యమైన చర్చలు జరపటానికి సమావేశ వాతావరణం అనుకూలంగా లేదని వారు అన్నారు.

ఇండిపెండెంట్ గ్రూపు వ్యతిరేకత

లక్నో, జనవరి 22

ఉత్తర ప్రదేశ్‌లో శ్రీ చరణ్ సింగ్ స్థానే నూతన నాయకుణ్ణి ఎన్నుకొనటానికి ఐక్యసంఘటనలో 18 మంది సభ్యులు గల ఇండిపెండెంట్ గ్రూపు నేడు తన వ్యతిరేకతను తెలియజేసింది

ఈ రోజు ఇక్కడ జరిగిన ఈ గ్రూపు సమావేశంలో పై తీర్మానం చేయబడింది.

కొంతమంది ఐక్యసంఘటన నాయకులు తమలోని కొందరి పేర్లను నాయకత్వపదవికి సూచించటం. తమ గ్రూపును విచ్ఛిన్నం చేయాలనే ప్రయత్నంగా ఈ సమావేశం తీర్మానించింది.

చిన్నపక్షం కోర్కెలకు విరుద్ధంగా ఐక్య సంఘటనలోని ప్రధాన పక్షాలు ఏవైనా ప్రయత్నాలు జరిపితే అవి ఐక్య సంఘటన విచ్ఛిత్తికి దారితీయగలవని ఆతీర్మానంలో వుంది. (యు. ఎన్. ఐ)

ఫిబ్రవరి 1 న ఐక్యసంఘటన జనరల్‌బాడీ సమావేశానికి శ్రీ చరణ్‌సింగ్ విజ్ఞప్తి

లక్నో జనవరి 22

ఉత్తరప్రదేశ్ ఐక్యసంఘటన నాయకత్వ సమస్యను చర్చించేందుకు ఫిబ్రవరి 1 న ఐక్యసంఘటన జనరల్‌బాడీ సమావేశాన్ని జరపవలసిందిగా ముఖ్యమంత్రి శ్రీ చరణ్ సింగ్ ఐక్యసంఘటన కన్వీనర్ శ్రీ ఉగ్రసేన్ (ఎస్. ఎస్. పి)ను కోరారు.

నీటిపారుదల మంత్రి శ్రీ ఉదిత నారాయణ్‌శర్మ నేడిక్కడ పై విషయాన్ని తెలియచేస్తూ, నాయకత్వ సమస్యను జనరల్ బాడీ మాత్రమే పరిష్కరించ గలదని అన్నారు

ఈ విషయాన్ని గురించి చర్చిస్తున్న సమన్వయసంఘానికి, ఈ విషయమై ఏదైనా నిర్ణయించేటానికి అధికారం లేదని ఆయన అన్నారు.

శ్రీ చరణ్‌సింగ్ నాయకత్వపదవికి రాజీనామా చేశారా, లేదా అన్నప్రశ్నపై మాట్లాడుతూ ఆయన ఐక్యసంఘటనలోని కొన్నిపక్షాలకోర్కెలపై రాజీనామా చేశారని అన్నారు.

అయితే అవాంఛనీయమైన సంఘటనలు జరుగకుండా ఉండే నిమిత్తం శ్రీ చరణ్ సింగ్ తన రాజీనామాను వ్రాతపూర్వకంగా సమర్పించ లేదని శ్రీ శర్మ అన్నారు.

కనీస కార్యక్రమాన్ని అమలు జరుప లేదన్న విమర్శలను గురించి మాట్లాడుతూ, ఆయన, కొన్ని కార్యక్రమాలను అమలుపర్చటం జరిగిందని, మరికొన్ని అమలు జరుగుతున్న దశలో వున్నాయని ఆయన అన్నారు.

కొన్ని కార్యక్రమాల అమలు ఆచరణ సాధ్యంకావని అనవసర [illegible] శ్రీ చరణ్‌సింగ్ [illegible] శ్రీ శర్మ అన్నారు (యు ఎన్ ఐ)

92 బస్తాల ధాన్యం పట్టివేత

మహబూబ్‌నగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుచే

మహబూబ్‌నగర్, జనవరి 22

మైసూర్‌లోనికి దొంగరవాణా జరుగుతున్న 92 బస్తాల వరి ధాన్యాన్ని, 4 బస్తాల బియ్యాన్ని మహబూబ్‌నగర్ చెక్‌పోస్ట్‌వద్ద స్పెషల్ డిప్యూటీ కలెక్టరు [illegible] పట్టుకున్నారు.

ఈ ధాన్యాన్ని 18 బండ్లపై తీసుకెళుతున్నారు.

కేరళ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ మహాసభ నేడే

కార్యక్రమ వివరాలగూర్చి సంయుక్త కార్యదర్శి వెల్లడి

కొట్టాయం జనవరి 22

రేపు యిక్కడ ప్రారంభం కానున్న కేరళ రాష్ట్ర కమ్యూనిస్టు మహాసభ, దేశంలో వున్న కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూలద్రోయడానికి కాంగ్రెస్‌పార్టీ గుత్తపెట్టుబడి దారులు కలిసిచేస్తున్న ప్రయత్నాలను సవాల్ చేసి ఓడించడానికి, దేశవ్యాపితంగా వామపక్ష ప్రజాతంత్రశక్తుల మధ్య ఐక్యత అవకాశాలను చర్చించుతుందని కేరళ కమ్యూనిస్టు కమిటీ సంయుక్త కార్యదర్శి శ్రీ ఎస్ కుమారన్ నేడిక్కడ చెప్పారు

శ్రీ కుమారన్ పత్రికాగోష్ఠిలో ప్రసంగిస్తూ పశ్చిమబెంగాల్‌లో కేంద్ర ప్రభుత్వంచేసిన చర్యగూడా చర్చకు వస్తుందని అన్నారు.

తమ ప్రజాతంత్ర హక్కుల కొరకు పోరాడుతున్న పశ్చిమ బెంగాల్ ప్రజలకు కమ్యూనిస్టుపార్టీ హృదయ పూర్వకతోడ్పాటు యిస్తుందని అన్నారు.

అక్కడ జరిగే ప్రజా ఆందోళనకు ప్రోత్సాహానికి పశ్చిమ బెంగాల్‌కు వాలంటీర్లను పంపే విషయాన్నిగూడా మహాసభ చర్చించ వచ్చునని అన్నారు.

ఆరురోజులపాటు జరిగే యీ మహాసభ కార్యక్రమాన్ని యిక్కడ విడుదల చేశారు. ప్రతినిధుల సమావేశంగాక, పారిశ్రామిక, ఆర్థికమహాసభ జరుగుతుంది. పరిశ్రమల మంత్రి శ్రీ టి. వి. థామస్ అధ్యక్షతవహిస్తారు. వ్యవసాయకార్మిక మహాసభకు వ్యవసాయశాఖ మంత్రి శ్రీ గోవిందన్ నాయర్ అధ్యక్షత వహిస్తారు ఇరిగేషన్‌సహకార శాఖ మంత్రి శ్రీ పి. ఆర్. కురూప్ ప్రారంభోత్సవం చేస్తారు.

గుజరాత్‌లో

కమ్యూనిస్టుపార్టీచే శాసనోల్లంఘన నేడే ప్రారంభం

రాష్ట్రప్రభుత్వ అస్తవ్యస్తవిధానాలకునిరసన

అహమ్మదాబాద్ జనవరి 22

గుజరాత్ ప్రభుత్వ బలహీన విధానాలకు నిరసనగా రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ రేపు శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభిస్తుందని రాష్ట్రపార్టీ కార్యదర్శి శ్రీ సుబోధ్ మెహతా నేడిక్కడ పత్రికాగోష్ఠిలో చెప్పారు

శాసనసభాభవనం ఆవరణలో అమలువున్న నిషేధాజ్ఞను ఉల్లంఘించే రూపంలో యీ శాసనోల్లంఘన జరుగుతుందని అన్నారు.

నర్మదా ప్రాజెక్టు సమస్యను శక్తివంతంగా కేంద్రం ముందు పెట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు.

ఇటీవల [illegible] గుజరాత్ 45000 మంది కార్మికులకు ప్రత్యామ్నాయ ఉద్యోగం కల్పించలేక పోయిందని అన్నారు.

నాజర్ ప్రభుత్వంపై కుట్ర జరిపినవారి విచారణ ప్రారంభం

కైరోలో ప్రత్యేక ట్రిబ్యునల్ ముందు

కైరో, జనవరి 22

నాజర్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి సైనిక కుట్ర జరిపిన 54 గురు లో నూ 12 మందిమీద ఈపేళ కైరోలో విచారణ ప్రారంభమైంది. ఇందులో 11 మంది సైనికాధికారులు.

వారంతా తాము నిరపరాధులని వాదించారు. అందులో 4 గురు తాము హింసాకాండకు గురిచేయబడ్డామని అన్నారు.

విచారణ ఒక 'ప్రత్యేక ట్రిబ్యునల్' ముందు జరుగుతున్నది ఈ ట్రిబ్యునల్‌కు యు ఎ ఆర్ ఉపాధ్యక్షుడు హుస్సేన్ షాఫీ అధ్యక్షత వహిస్తున్నారు.

హానికరమైన బ్యాంకింగు బిల్లు

ఢిల్లీ రిజర్వుబ్యాంకు ఉద్యోగుల నిరసన

న్యూఢిల్లీ, జనవరి 22

ఉపప్రధాని శ్రీ మురార్జీదేశాయిచే లోక్‌సభలో ప్రవేశపెట్టబడిన బ్యాంకింగు చట్ట సవరణ బిల్లుకు ఢిల్లీ రిజర్వు బ్యాంకు ఉద్యోగుల సంఘం నేడు నిరసన ప్రకటించింది.

ఈసవరణవల్ల బ్యాంకింగుపరిశ్రమ లోని గుత్త పెట్టుబడిదారులు జాతి ఆర్థిక పరిస్థితిపై తమ కబంధహస్తాలను మరింతగా పెనవేయటానికి అవకాశం కల్పిస్తుందనీ, బ్యాంకుల జాతీయకరణకు [illegible] ఈ సంఘ ఉపాధ్యక్షుడు శ్రీ ఎమ్.ఎల్. నవానీ ఒక ప్రకటనలో విమర్శించారు.

పారిశ్రామిక వివాద చట్టం క్రిందనూ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగానూ బ్యాంకు ఉద్యోగులు సాధించుకున్న అనేక ఉద్యోగ భద్రతలకు ఈ బిల్లువల్ల నష్టం కలుగుతుందని కూడా ఆయన విమర్శించారు

(యు ఎన్. ఐ)

శ్రీ మోహితే కృష్ణారావుకు పుత్ర వియోగం

ఏలూరు మున్సిపల్ ఛైర్మన్

ఏలూరు జనవరి 22

ఏలూరు మునిసిపల్ ఛైర్మన్ శ్రీ మోహితే కృష్ణారావు జ్యేష్ఠపుత్రుడు శ్రీ కృష్ణకుమార్ (వయస్సు 30) గుండెజబ్బుతో నిన్న మధ్యాహ్నం మద్రాసులో మరణించారు.

ఈ రోజు సాయంత్రం ఏలూరులో అంత్యక్రియలు జరిగాయి

గన్నవరం, కల్వకుర్తి ఉప ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ పోటీ

హైదరాబాద్, జనవరి 22

గన్నవరం, కల్వకుర్తి శాసనసభా నియోజక వర్గాలకు అచిరకాలంలో జరుగనున్న ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థులను పోటీ చేయించాలని రిపబ్లికన్ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ నిర్ణయించింది

ఆల్ సెయింట్స్ స్కూళ్ళ మూసివేత

హైదరాబాద్, జనవరి 2.

ఉపాధ్యాయులసమ్మె ఫలితంగా ఆల్ సెయింట్స్ హయ్యర్ సెకండరీ స్కూళ్ళలో హైదరాబాద్‌లోని కొన్ని విభాగాలను మూసివేస్తున్నట్టు రెక్టార్ ప్రకటించారు.

తిరిగి ప్రకటించేవరకు ఉన్నత మాధ్యమిక స్కూలు విభాగాలు మూసివేసి వుంటాయని ఆయన తెలిపారు.

ఆంధ్రలో హిందీ వ్యతిరేక ప్రదర్శనలు

హైదరాబాద్, జనవరి 22

పూరీ-హైదరాబాదు ఎక్స్‌ప్రెస్‌ను ఆదివారంనాడు రాత్రి తాడేపల్లిగూడెం వద్ద హిందీవ్యతిరేక ప్రదర్శకులు అరగంటసేపు నిలుపుచేశారని నేడిక్కడ అధికార సమాచారం వల్ల తెలుస్తున్నది.

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో హిందీవ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి అయితేఅన్నిచోట్ల ఆందోళన ప్రశాంతంగానే జరుగుతున్నది

కడపజిల్లా ఆందోళన [illegible] కూడా పాకింది హైస్కూలు విద్యార్థులు రైల్వే స్టేషన్‌కువెళ్ళి మద్రాసు బొంబాయి ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేశారు. పోలీసు అధికారులు తక్షణం అక్కడకు వెళ్ళి విద్యార్థులను చెదరగొట్టారు.

రాజమండ్రిలో విద్యార్థులకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి

రాజమండ్రి జనవరి 22

భాషా విషయంలో హిందీయేతర ప్రాంతాలకు ఏమీ అన్యాయం జరగకుండా వుండేటందుకు ఈ సమస్యను గురించి తానూ, ఇతర దక్షిణాది నాయకులూ త్వరలోనే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపనున్నామని ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ అన్నారు.

ధవళేశ్వరంనుండి ఆయన నేడిక్కడకు వచ్చారు

హిందీ వ్యతిరేక ఆందోళనను విరమించ వలసిందిగా ఆయన రాజమండ్రి విద్యార్థులను కోరారు.

హనోయ్‌పై దాడుల విరమణకు శ్రీ హుస్సేన్-టిటోల డిమాండ్

టిటో గౌరవార్థం భారతరాష్ట్రపతిచే విందు

న్యూఢిల్లీ జనవరి 22

సంప్రదింపుల ద్వారా వియత్నాం సంఘర్షణకు పరిష్కార మార్గం వెదికేముందు ఉత్తరవియత్నాంపై అమెరికా బాంబు దాడులకు స్వస్తిచెప్పాలని యుగోస్లావియా అధ్యక్షుడు టిటో, భారత రాష్ట్రపతి జాకిర్‌హుస్సేన్ నేటిరాత్రి పునరుద్ఘాటించారు

భారత్‌లో పర్యటనకు వచ్చిన టిటో గౌరవార్థం రాష్ట్రపతి భవన్‌లో యేర్పాటుచేసిన విందులో డా॥ జాకిర్‌హుస్సేన్ ప్రసంగానికి టిటో జవాబు చెబుతూ అమెరికా చర్యలు ఆగ్నేయాసియాలో వున్న యితర దేశాలకు ప్రమాదంగా తయారయ్యాయని హెచ్చరించారు

1954 జెనీవా ఒప్పందం ప్రాతిపదికపై వియత్నాం సమస్యకు శాంతియుత పరిష్కార మార్గాన్ని కనుగొనవచ్చునన్న భారతదేశ విశ్వాసాన్ని జాకిర్‌హుస్సేన్ పునరుద్ఘాటించారు జోక్యం లేకుండా, బేషరతుగా అమెరికా బాంబుదాడులు ఆపాలని టిటో అన్నారు

పశ్చిమాసియా సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రపతి యిలా అన్నారు:

"దురాక్రమణదారులు ఖాళీ చేయాలన్న సూత్రానికి మేము కట్టుబడి వుంటాము మా యిరుగు పొరుగు వారితో శాంతి, భద్రతలతో జీవించటానికి ప్రతి దేశానికి హక్కు వున్నదన్న సూత్రానికి మేము కట్టుబడి వుంటాము.

భారత - పాకిస్తాన్ సంబంధాలను ప్రస్తావిస్తూ యిలా అన్నారు:

ఇరుగు పొరుగు దేశాలలో వున్న అన్ని సమస్యలకు శాంతియుతమైన, శాశ్వతమైన పరిష్కారం కుదుర్చుకోవటానికి తాష్కెంట్ ఒప్పందం అనువైనదని భారతదేశం భావిస్తున్నది.

"మా, స్నేహ హస్తం యెల్లప్పుడూ చాచి వుంచబడుతుంది. మా ప్రయత్నాలలో పట్టుదల కలిగి యుండదానికే మేము నిశ్చయించాము"

"ప్రపంచ ప్రఖ్యాత రాజకీయ వేత్త ఒక శక్తివంతమైన దేశానికి నాయకుడు ఐన యుగోస్లావియా అధ్యక్షుడు ఈనాడు మన మధ్యవుండడం మన అదృష్టం మిమ్ములనూ, మీ టిటోనూ, యుగోస్లావియా నుండి వచ్చిన ఇతర మిత్రులనూ ఆహ్వానించటం ఒక మహద్భాగ్యంగా భారత ప్రజలు భావిస్తున్నారు" అని ఆయన అన్నారు.

అలీన విధానం, శాంతియుత సహజీవనం అన్న విధానాలమీద ఆధారపడి భారత యుగోస్లావియా దేశాలమధ్య గత కొద్ది సంవత్సరాల నుండి ప్రత్యేక స్నేహం, సహకార సంబంధాలు నెలకొని వున్నాయని శ్రీ జాకిర్‌హుస్సేన్ అన్నారు

భారత, యుగోస్లేవియా, యు. ఎ. ఆర్ దేశాలమధ్య నెలకొనివున్న త్రైపాక్షిక ఒప్పందాలు ప్రస్తుత టిటో పర్యటనవల్ల మరింత ముందుకు పోగలవనీ ఈ దేశాల మధ్య మరింత సన్నిహిత స్నేహ సహకార బంధాలు పెంపొందగలవనీ ఆయన ఆశాభావం వెలిబుచ్చారు.

భారత ప్రధాని, యుగోస్లేవియా అధ్యక్షుల మధ్య అంతర్జాతీయ పరిస్థితులపై [illegible] జరిగినట్లుగానే ఎటువంటి సంకోచం లేకుండా హృదయపూర్వకంగానూ చర్చలు జరుగగలవని ఆయన వ్యాఖ్యానించారు

ప్రపంచ శాంతి పట్ల ఉభయదేశాలకు గల అభిలాష వల్ల ప్రపంచంలోని ఏ భాగంలో యుద్ధం జరిగినా ప్రపంచ శాంతికి భంగకరమని భావించటం జరుగుతున్నదని ఆయన అన్నారు.

పశ్చిమాసియాలో గత సంవత్సరం జరిగిన యుద్ధం ప్రస్తుతానికి ఆగినప్పటికీ పూర్తిగా ప్రమాదం తొలగిపోలేదనీ ఆక్రమిత భూభాగాలనుండి దురాక్రమణదారు తొలగిపోవటం భారత ప్రభుత్వ అభిమతమనీ. అదే సమయంలో పొరుగు దేశాల మధ్య ఒకదేశపు ఉనికినీ, ఆ దేశం సమగ్రతను గౌరవించాలనీ ఆయన అన్నారు

పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పటానికి టిటో జరిపిన కృషిని ఆయన కొనియాడారు

అయితే వియత్నాం యుద్ధ విషయంలో శాంతిస్థాపన విషయంలో ఎటువంటి పురోగతి జరగనందుకు ఆయన విచారం వెలిబుచ్చారు

1954 జెనీవా ఒప్పందపు ప్రాతిపదికపై శాంతి ప్రయత్నాలు జరగాలని ఉభయదేశాలు కోరుకున్నాయని ఆయన అన్నారు.

ఉత్తరవియత్నాం మీద బాంబుదాడులను ఆపుచేసినప్పుడే శాంతి ప్రయత్నాలు సాధ్యమని ఈ అభిప్రాయంతోపాటు అనేకదేశాలు భావిస్తున్నాయని శ్రీ జాకిర్‌హుస్సేన్ అన్నారు.

రాజకీయ, [illegible] పైచేయి సంపాదించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

శాంతి సాధనకు భారతదేశం శాయశక్తులా కృషి చేయగలదని ఆయన అన్నారు.

ఫిబ్రవరి 2న ఐరాస కార్యదర్శి ఉథాంట్ రాక

న్యూఢిల్లీ జనవరి 22

తుంబా వద్ద గల రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని ఫిబ్రవరి 2 న ప్రధాన మంత్రి ఇందిరా గాంధి దేశానికి సమర్పించే కార్యక్రమానికి ఐరాస ప్రధాన కార్యదర్శి ఉథాంట్ హాజరవుతారు.

మణిపూర్ బెంగాల్ రాష్ట్రాల్లో మధ్యంతర ఎన్నికలు జరగాలి

శ్రీ భూపేష్‌గుప్త డిమాండ్

ఇంఫాల్, జనవరి 22

మణిపూర్‌లో సుస్థిరమైన మంత్రివర్గం ఏర్పడాలంటే మధ్యంతర ఎన్నికలు జరగాలని కమ్యూనిస్టు నాయకుడు, పార్లమెంటు సభ్యుడు శ్రీ భూపేష్‌గుప్త నేడిక్కడ అన్నారు

మణిపూర్‌లో కొద్దిరోజులు అధికారంలో వున్న ఐక్య సంఘటన ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చే ప్రయత్నాలను జరుపుకోవటానికి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మణిపూర్ చీఫ్‌కమిషనర్‌ను ఒకసాధనంగా ఉపయోగించుకుంటున్నదని ఆయన విమర్శించారు.

పశ్చిమబెంగాల్‌లో ఐక్యసంఘటన మంత్రివర్గ బర్తరఫ్ చట్టవిరుద్ధమని, గవర్నరుచర్య రాజ్యాంగవిరుద్ధమనీ ఆయన ఖండించారు.

పశ్చిమబెంగాల్ గవర్నరుచర్య; [illegible] విస్మరించేచర్యఅనీ గవర్నరు పదవిని రద్దుచేయటం గురించి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందనీ ఆయన అన్నారు.

మధ్యంతర ఎన్నికలు జరపటానికి హామీ ఇస్తూ, రాష్ట్ర పరిపాలనను రాష్ట్రపతి చేపట్టటమే పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడిన క్లిష్ట పరిస్థితిని పరిష్కరించటానికి ఏకైకమార్గమని శ్రీ భూపేష్‌గుప్తా అన్నారు.

కొసిగిన్ పర్యటన వివరాలు

న్యూఢిల్లీ జనవరి 22

జనవరి 25 న భారత పర్యటనకు రానున్న సోవియట్ ప్రధాని కొసిగిన్ అనేక కార్యక్రమాల్లో పాల్గొనవలసివుంది ఈయన 5 రోజులపాటు పర్యటన జరుపుతారు.

హరిద్వార్‌లో సోవియట్ సహకారంతో నిర్మించబడుతున్న భారీ విద్యుత్ పరికరాల కర్మాగారాన్ని, ఏంటిబయాటిక్స్ కర్మాగారాన్ని ఆయన దర్శిస్తారు. ఆయన జయపూర్‌ను కూడా సందర్శిస్తారు.

న్యూఢిల్లీలో ఆయన రాజఘాట్ నెహరూ మ్యూజియంను రష్యన్ భాషా అధ్యయన సంస్థనూ దర్శిస్తారు. [illegible] జరిగే రిపబ్లిక్ దిన కవాతుకు ఆయన హాజరవుతారు.

కళాశాల ఉపాధ్యాయుల ప్రదర్శన

కేరళ సచివాలయం ముందు

తిరువనంతపురం, జనవరి 22

కేరళలోని ప్రయివేటు కళాశాలలో పని చేస్తున్న వెయ్యిమందికిపైగా ఉపాధ్యాయులు నేడు ప్రభుత్వ సచివాలయంముందు ప్రదర్శన జరిపారు. అందులో వందమందికిపైగా మహిళలు

ప్రభుత్వమే తమకు నేరుగా జీతాలను అందజేయాలని సర్వీసులకు ప్రభుత్వ హామీ ఉండాలనీ వీరు డిమాండ్ చేస్తున్నారు.

అఖిల కేరళ ప్రయివేటు కళాశాలల ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన [illegible] అంతకుముందు నగర వీధులలో ఊరేగింపు జరిపారు

సోవియట్‌చే వినిమయ సరుకుల కొనుగోలు

భారత్ అభ్యర్థనపై

న్యూఢిల్లీ, జనవరి 22

వినిమయ వస్తువులను ఎక్కువగా కొనుగోలు చేయవలసిందిగా భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సోవియట్ ప్రభుత్వం మన్నించింది అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంది.

1968 వ సంవత్సరానికి ఉభయ దేశాల మధ్య జరగవలసిన వాణిజ్యం గురించి ఇటీవల భారతదేశం సందర్శించిన సోవియట్ వాణిజ్య బృందానికి ఇరువురకూ ఒక స్మృతి పత్రం సమర్పించ బడింది.

ఇనుపతార, తోలు వస్తువులు రెడీమేడ్ దుస్తులు మున్నగువాటి తయారీ పద్ధతులను పరిశీలించటానికి త్వరలో 4 సోవియట్ బృందాలు భారతదేశం సందర్శించ నున్నాయి.

భారత - సోవియట్ సంయుక్త పరిశ్రమల స్థాపన గురించి కూడా ఈ స్మృతి పత్రం ప్రస్తావించ బడింది. సోవియట్ ప్రధాని కొసిగిన్ భారతపర్యటనలో ఈ విషయం కూడా చర్చించ బడుతుంది.

గంగానదిలో 28 మంది మునక?

వారణాసి, జనవరి 22

ఘాజియాపూర్‌కు దక్షిణంగా 10 మైళ్ళదూరంలో నిన్న 60మంది ప్రయాణీకులతో ఉన్న ఒక బోటు గంగానదిలో మునిగిపోగా 28 మంది మరణించినట్లు భావించబడుతున్నది.

ప్రమాదం జరిగిన ప్రదేశానికి దగ్గరవున్న ఒక బోటు వెంటనే మునిగిపోయిన బోటు దగ్గరకువెళ్ళి 32 మందిని రక్షించింది

ప్రయాణీకులలో ఎక్కువ భాగం స్త్రీలు.

తిరుపతిలో ఇస్కస్ సమావేశం

గుంటూరు సభకు ప్రతినిధుల ఎన్నిక

తిరుపతి, జనవరి 21

భారత ఇండో సోవియట్ సాంస్కృతిక సంఘం తిరుపతిశాఖ సర్వసభ్య సమావేశం యీ మాసం 20 వ తారీఖున జరిగినది తిరుపతిలో ఇటీవలనే యీ శాఖ స్థాపించబడినా - 150 మందికిపైగా వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు విద్యార్థులు మొదలుకొని కళాశాల ప్రొఫెసర్లవరకు మెంబర్లుగా చేరినారు. ఇంకా ఎంతోమంది సభ్యులుగా చేరుటకు ముందుకు వస్తున్నారు. ఈ కృషినంతాకూడా సర్వసభ్య సమావేశం సమీక్షించింది

గుంటూరులో జరుగబోవు 'ఇస్కస్' జాతీయ మహాసభలకు ప్రతినిధులుగా శ్రీయుతులు కె. అనంతాచారి, వి వెంకటశివయ్య, టి కె. విజయకుమార్, యం. ఆర్. చంద్రన్ ఏ. ధర్మారావు. ఎ. మునిరత్నం లను [illegible] మరి 5 గురిని ఈ సర్వసభ్యసమావేశం ఎన్నుకొన్నది.

ప్రదేశ్ శాంతి సమితి కార్యవర్గ సమావేశం

గుంటూరులో జనవరి 27 న

గుంటూరు, జనవరి 23

హైదరాబాద్‌లో 1968 ఏప్రిల్ 27,28,29 తేదీలలో జరగనున్న జాతీయ శాంతిమహాసభ సందర్భంగా, గుంటూరులో బాలికానగర్‌లో (బ్రహ్మానందరెడ్డి [illegible]) మహాసభ హాలులో ప్రదేశ్ శాంతి సమితి కార్యవర్గ సమావేశం జనవరి 27 మధ్యాహ్నం 4 గం. జరుగుతుందని ప్రధానకార్యదర్శి డాక్టర్ బి. వి. యల్ యన్. రాజు తెలియజేస్తున్నారు.

ఈ సమావేశంలో జాతీయమహాసభ కార్యక్రమం రూపొందించబడుతుంది. కార్యవర్గసభ్యులందరూ పైసమావేశానికి తప్పని సరిగా హాజరుకావాలని తెలియ జేస్తున్నారు.

హైదరాబాద్ ప్రముఖ సంగీతకారుడు బడే గులాంఅలీఖాన్ పరిస్థితి సంతృప్తికరంగా లేదని ఈ నెల 22 వ తేదీన ఆయన డాక్టరు తెలియజేశారు.

రాజస్థాన్ కాంగ్రెస్ ప్రభుత్వావాగ్దానభంగం

రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్‌తోసహా పలువురు సభ్యుల తీవ్ర విమర్శ

జైపూర్, జనవరి 22

ఆర్థికంగా గిట్టుబాటుకాని భూకమతాలను భూమిశిస్తునుంచి మినహాయిస్తామని గత సమావేశంలో ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని అమలుపరచనందుకు రాజస్థాన్ శాసనసభలో ప్రతిపక్షాలు నేడు తీవ్రమైన దాడి చేశాయి.

ఒక్కసభ్యుడు మినహా మిగతా కాంగ్రెసు సభ్యులు అందరూ ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు జరపవలసిందేనని డిమాండు చేశారు

శాసనసభలో చేసిన ప్రకటనను అమలు పరచటంలో విఫలమైనందుకు ప్రభుత్వంపై విశ్వాస హత్య తీర్మానాన్ని ప్రతిపక్ష నాయకుడు శ్రీ మహారావల్ లక్ష్మణ్‌సింగ్ ప్రతిపాదించారు యస్ యస్ పి పక్ష నాయకుడు శ్రీ రాంకిషన్. బి. కె. డి పక్ష నాయకుడు శ్రీ చంద్రప్రకాష్ గుప్తా, కమ్యూనిస్టు నాయకుడు శ్రీ రామానంద్ అగర్వాల్, జనసంఘ సభ్యుడు శ్రీ దేవీసహాయ్ గౌతమ్ యస్. యస్. పి. సభ్యుడు శ్రీ నత్తిసింగ్, స్వతంత్ర పార్టీ సభ్యుడు శ్రీ [illegible]సింగ్ రావత్, శ్రీ [illegible] నారాయణ్ [illegible] కూడా విశ్వాస రాహిత్య తీర్మానాన్ని బలపరుస్తూ ప్రతిపాదించారు

51 శాతం భూమిశిస్తు వసూలుచేసి, [illegible] మిగతా 51 శాతం శిస్తు వసూలు చేసి, ఆ విధంగా వచ్చిన సొమ్మును [illegible] ఖర్చుపెట్టాలని కాంగ్రెసు సభ్యుడు శ్రీ [illegible] తీర్మానానికి సవరణ ప్రతిపాదించారు.

ప్రభుత్వ ప్రకటనను అమలుజరపక పోవడం ప్రజాస్వామ్యానికి దెబ్బమాత్రమే కాక చిన్నరైతుల విశ్వాసాన్ని కూడా కోల్పోయినట్లేనని మహారావల్ తన తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ చెప్పారు.

తర్వాత రాంకిషన్, రామానంద అగర్వాల్ (కమ్యూనిస్టు) ప్రసంగిస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు జరపకుండా వుండేటందుకు శాసనసభ ధ్రువీకరణను పొందాలని అన్నారు. తర్వాత ప్రభుత్వ పక్షను పలువురు సభ్యులు తీవ్రంగా విమర్శిస్తూ ప్రసంగించారు.

అమెరికాలో 10శాతం పన్నుల హెచ్చింపు

జాన్సన్ ప్రతిపాదన

వాషింగ్టన్, జనవరి 22

ద్రవ్యోల్బణాన్ని అరికట్టటానికి, డాలర్ విలువను కాపాడటానికి ప్రస్తుతం ఉన్న పన్నులను 10 శాతం హెచ్చిస్తూ అమెరికా అధ్యక్షుడు నేడు అమెరికా కాంగ్రెసులో తన ప్రతిపాదనను ప్రవేశపెట్టారు.

జాన్సన్ ఆర్థిక [illegible] సాధనాల కమిటీకి నివేదిస్తూ 1969 యేడాదిలో సగం వరకూ పన్నుల హెచ్చింపు సాగుతుందని, వియత్నాంలో పెద్ద మొత్తం సైనిక ఖర్చును విరమించే అంతకు ముందుగానే పన్నులపై సర్‌ఛార్జిని ఉపసంహరించడం జరుగుతుందని తెలిపారు. వ్యక్తిగత ఆదాయపు పన్నులపై సర్‌ఛార్జి ఏప్రిల్ 1 నుండి అమలులోకి వస్తుందనీ, కార్పొరేట్ ఆదాయపుపన్నులపై సర్‌ఛార్జి జనవరి 1 నుండి అమలులో ఉంటుందని ట్రెజరీ సెక్రటరీ హెన్రీఫౌలర్ చెప్పారు.

టెలిఫోను, మోటారు కార్లపై వాణిజ్య సుంకాన్ని తగ్గించే ప్రతిపాదనను వాయిదా వేశారు.

ఈ పన్నుల హెచ్చింపు వలన 1967-68 సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయంలో 300 కోట్ల డాలర్లు పెరుగుతుంది.

పత్రికల సమ్మె

(1 వపేజీ తరువాయి)

సభలో వార్తాపత్రికల ఉద్యోగులకు వేజ్‌బోర్డు సిఫార్సులను అమలు జరపాలని డిమాండ్ చేస్తూ వివిధ రాజకీయపార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు ప్రసంగించారు

ఈ సభకు మధ్యప్రదేశ్ వర్కింగు జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు శ్రీ డి.ఎల్.షా అధ్యక్షత వహించారు.

ఈ సభలో కమ్యూనిస్టు నాయకులు, కార్మిక నాయకులు శ్రీ షకీరాలీఖాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మోహన్‌లాల్ అస్థానా ప్రసంగించారు.

సిసిలీ భూకంప బాధితుల ఇక్కట్లు

సహాయ కార్యక్రమ నిర్వహణలో లోపాలు

సిసిలీ జనవరి 22

గత వారంలో సిసిలీలో భూకంపానికి గురియైన బాధితుల సహాయ కార్యక్రమాల నిర్వహణలో చాలా లోపాలు జరుగుతున్నట్లు తెలియవచ్చింది

ఆహారపదార్థాలు ఒకచోట కుప్పతిప్పలుగా పడిమురిగిపోతుంటే మరియొకచోట దొరక బోయే కార్లను ఆపి ఆహారపదార్థాలకై యాచిస్తూ బాధితులు కనబడుతున్నారు. బ్లాంకెట్లు వస్త్రాల పంపిణీకూడా క్రమబద్ధంగా లేదు

ఈ భూకంపంలో మూడు పట్టణాలు పూర్తిగా ధ్వంసమైనాయి తొమ్మిది పాక్షికంగా భూకంపానికి గురియైనాయి. 80000 మందికి పునరావాస సౌకర్యం కలిగించ వలసి యున్నది.

వీరికొరకు నిర్మించిన గుడారాలు ఆరోగ్యకరంగా లేనందున అంటువ్యాధి సోకే ప్రమాదమున్నదని తెలియవచ్చింది

ఈ ప్రమాదంలో చనిపోయిన 500 మందిలో 204 శవాలు ఇంతవరకు దొరికాయి.

ఇంకా భూకంపాలు వచ్చే ప్రమాద మున్నందువల్ల ఇక్కడి ప్రజలు. తమకు భవనాల్లో ఏర్పరచిన సౌకర్యాలను తిరస్కరిస్తూ చలిలోనే ఆరుబయట నివసిస్తున్నారు.

ఏలూరుకు శ్రీడాంగే రాక

ఏలూరు, జనవరి 22

ఏలూరులో జరుగుతున్న రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ 11 వ. మహాసభలో పాల్గొనేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ డాంగే బొంబాయినుండి బయలుదేరి నేటి సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ చేరి, అక్కడి నుండి కారులో ఏలూరు వచ్చారు

హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీ యన్. సత్యనారాయణరెడ్డి, నారాయణ ప్రసాద్ లు స్వాగతం చెప్పారు.

ఏలూరు పట్టణ మేధావుల సమావేశంలో శ్రీడాంగే ప్రసంగం

జనవరి 24 న యేర్పాటు

ఏలూరు జనవరి 22

ఈ నెల 24 సాయంత్రం 6 గంటలకు యిక్కడ జరుగుతున్న ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ 11 వ మహాసభకు హాజరవుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ డాంగే, యిక్కడ యేర్పాటు చేయబడే పట్టణ మేధావుల సమావేశంలో ప్రసంగిస్తారు.

మోతే గంగరాజు పార్కులో ప్రత్యేకంగా నిర్మించిన పెండాల్‌లో యీ సమావేశం జరుగుతుంది. ఆహ్వానితులకు మాత్రమే ప్రవేశం.

ప్రైవేటు కళాశాలల ఉపాధ్యాయుల ప్రదర్శన

ప్రభుత్వ సెక్రటేరియట్ వద్ద

తిరువనంతపురం, జనవరి 22

అఖిల కేరళ ప్రైవేటు కళాశాలల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యాన మహిళా అధ్యాపకులతో సహా సుమారు 2000 మంది అధ్యాపకులు కేరళ ప్రభుత్వ సెక్రటేరియట్ వద్ద నేడు ఒక గంటసేపు ప్రదర్శన జరిపారు తమకు మంచి పని పరిస్థితులు కల్పించాలని వారు డిమాండు చేశారు.

ప్రైవేటు కళాశాలల అధ్యాపకుల జీతాలను ప్రభుత్వమే నేరుగా చెల్లించాలనీ, పదవీ విరమణ సందర్భంగా యిచ్చే సౌకర్యాలను విస్తృతపరుస్తూ కేరళ నూతన విశ్వవిద్యాలయ బిల్లు [illegible] డిమాండు చేసింది. కేరళ విశ్వవిద్యాలయ కార్యాలయం ఎదుటకూడా వారు అంతకు ముందు ప్రదర్శన జరిపారు.

పాల సరఫరా ప్రాజెక్టు సిబ్బంది ప్రదర్శన

రాష్ట్ర సచివాలయంముందు

హైదరాబాద్, జనవరి 22

పాల సరఫరా ప్రాజెక్టు ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రిట్రెంచ్‌మెంట్ విధానం, బదిలీలు, ప్రమోషన్ తదితర చర్యలకు నిరసన తెలియజేస్తూ నేడు ఇక్కడి సచివాలయం ముందు ప్రదర్శన జరిపారు.

పాలసరఫరా ప్రాజెక్టు అధికారి దిష్టి బొమ్మను గాడిదపై ఊరేగించారు.

కలకత్తాలో సైనికుల, పోలీసుల మధ్య కొట్లాట

7 గురికి గాయాలు

కలకత్తా జనవరి 23

గత రాత్రి యిక్కడ [illegible] రోడ్డుపైనున్న బ్యాంకువద్ద కలకత్తా సాయుధ పోలీసుల సరిహద్దు భద్రతా దళాల మధ్య జరిగిన ఘర్షణలో 6 గురు పోలీసులు. ఒక పోలీసు అధికారి గాయపడ్డారు.

ఈ కొట్లాట గత రాత్రి 9 గంటలకు ప్రారంభమై 2 గంటలపాటు కొనసాగింది ఈ కొట్లాటలో రైఫిళ్ళు లాఠీలను కూడా వినియోగించారు. సరిహద్దు భద్రతా దళం సభ్యుడు ఒక సాయుధ పోలీసు డ్రైవరును అవమానించడంవలన ఈ కొట్లాట సంభవించిందని తెలియవచ్చింది.

విశాలాంధ్ర

1968, జనవరి 24 బుధవారం

పత్రికా ఉద్యోగులు

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించక పూర్వం పత్రికా నిర్వహణ ఒక ఆదర్శంకొరకు చేసే కృషిగా ఉండేది గత ఇరవై సంవత్సరాలలో ఈ స్వరూపం గుత్త పత్రికలకు సంబంధించినంత వరకు మారిపోయింది టాటా బిర్లా గోయెంకా వంటి గుత్త కుటుంబాలు పత్రికలపై ఆధిపత్యం సంపాదించారు గుత్త పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాల సాధన కనుగుణంగా తమ పత్రికలను నిర్వహిస్తున్నారు

ఒకప్పుడు పత్రికా నిర్వహణ నష్టంతోకూడిన వ్యాపారం కాని ఇప్పుడు గుత్తవర్గాల ఆధిపత్యం క్రింద పత్రికల నిర్వహణ లాభసాటి వ్యాపారంగా మారింది

ఈ కారణాలవలన పత్రికలలో పనిచేసే పాత్రికేయులు తదితర సిబ్బంది తమకు కూడా న్యాయమైన వేతనాలు, తదితర సౌకర్యాలు కావలెనని ఆందోళన చేస్తున్నారు.

1962 లో ప్రభుత్వం, పాత్రికేయులకు, పాత్రికేయేతరులకు వేర్వేరు వేతనాలబోర్డులు ఏర్పరచింది నాటినుండి నేటివరకూ అడుగడుగునా. గుత్తపత్రికాధిపతులు ఆ బోర్డుల పనికి ఏవో ఆటంకాలు కల్పిస్తునే ఉన్నారు ఎట్టకేలకు ఆ బోర్డులు నివేదికలను తయారు చేశాయి. అసంతృప్తికరంగాఉన్న పాత్రికేయులవేతన నిర్ణాయకసంఘసిఫార్సులకు నిరసనగా ఆ సంఘంలో సభ్యులైన పాత్రికేయుల ప్రతినిధులు, తమ భిన్నాభిప్రాయాన్ని జతపర్చారు

ప్రభుత్వం, పాత్రికేయుల భిన్నాభిప్రాయాన్ని త్రోసిపుచ్చింది. మెజారిటీ నివేదికను సైతం యధాతధంగా ఆమోదించక సవరణలు చేసింది. ఇన్నిమార్పులు చేర్పులతో, ఆమోదించబడిన పాత్రికేయుల వేతనసంఘ సిఫార్సులను 1967 జనవరి నుండి పై తరగతి పత్రికలు, 1967 జూలై నుండి క్రింది తరగతి పత్రికలు అమలు జరపాలని ఉత్తర్వు చేసింది

గుత్త పత్రికాధిపతులకు ఈ ఉత్తర్వును అమలు జరపటం ఇష్టంలేదు. కనుక పాత్రికేయుల వత్తిడి హెచ్చుగా ఉన్నచోట అలా అమలు జరుపుతామని ప్రకటిస్తూనే. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ కోర్టులలో దావా వేయటానికి తయారవుతున్నారు

ప్రభుత్వం సూచించిన పాత్రికేయుల వేతనబోర్డు సిఫార్సులు అతి కనీసమైనవి. గుత్త పత్రికాధిపతులు వాటిని అమలు జరపటంలో ఎట్టి ఆర్థిక ఇబ్బందిలేదు. కేవలం కక్షతోమాత్రమే యీ సిఫార్సులను వారు వ్యతిరేకిస్తున్నారు

పాత్రికేయేతర సిబ్బందికి కూడా ప్రభుత్వం వేతనాల బోర్డును నియమించింది అయితే వాటిని అమలుజరపవలసిందిగా చట్టరీత్యా ఉత్తర్వు మాత్రం చేయలేదు. దీనిని అవకాశంగా తీసుకొని, పాత్రికేయులకు వేతనాలు అమలు జరుపుతామని అంటున్న గుత్త పత్రికాధిపతులు సైతం పాత్రికేయేతర సిబ్బందికిమాత్రం వేతనాల బోర్డు సిఫార్సులను అమలు జరప నిరాకరిస్తున్నారు

గుత్త పత్రికాధిపతుల ఈ ధోరణికి నిరసనగా నేడు దేశ వ్యాపితంగా పత్రికా సిబ్బంది సమ్మె చేయవలసిందిగా అఖిల భారత పాత్రికేయుల సమాఖ్య పిలుపిచ్చింది. పి. టి. ఐ. యు. యన్.ఐ. వంటి వార్తాసంస్థల ఉద్యోగులు సైతం సమ్మెకు నిశ్చయించారు.

భారత పత్రికా రంగంలో. పాత్రికేయులు పాత్రికేయేతరులు కలిసి గుత్త పత్రికాధిపతుల వైఖరికి నిరసనగా ప్రత్యక్ష కార్యాచరణకు దిగటం ఇదే మొదలు. కనుక ఈ పరిణామం హర్షణీయం.

భావప్రకటన స్వేచ్ఛకు మూలాధారాలైన వార్తాపత్రికలపై గుత్తకుటుంబాల నిరంకుశ పెత్తనాన్ని సడలించేందుకు తోడ్పడేచర్య ఇది.

కనుక పత్రికా సిబ్బంది జరుపుతున్న ఈ ప్రత్యక్ష కార్యాచరణను ప్రజాతంత్రవాదులు. గుత్తవ్యతిరేక శక్తులు బలపరచటం వారి విధ్యుక్త ధర్మం.

కార్మిక సంక్షేమ పధకాలను చేనేత వారికి వర్తింపచేయాలి

నర్సాపురం సమావేశం డిమాండ్

నర్సాపురం. జనవరి 22

కార్మికసంక్షేమ పధకాలను చేనేతకార్మికులకు సైతంవెంటనే వర్తింపచేయాలని నర్సాపురం చేనేతసంఘ సమావేశం డిమాండ్ చేసింది.

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం చేనేతసంఘసమావేశం ఇటీవల జరిగింది.

చేనేత కార్మికులకు కనీస వేతనం, ప్రావిడెంటుఫండ్, బోనస్ చట్టాలను వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆ సమావేశం తీర్మానించింది.

తీర్మానం నకళ్ళు కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాధికారులకు లేబరు అధికారులకు పంపబడ్డాయి.

ఆ తీర్మానంలో ఇలా పేర్కొనబడినది.

"దేశంలో 80 లక్షల చేనేత కార్మికులు. ఆంధ్రప్రదేశ్‌లో 2 లక్షల చేనేతకార్మికులు చేనేత పరిశ్రమలో పనిచేస్తున్నారు" "చేనేత సొసైటీలలో షేరుధనము చెల్లించి పని చేస్తున్నవారిని, స్వంతంగా కొద్దిపెట్టుబడి పెట్టుకొని పనిచేసుకొనేవారిని మినహాయించితే మిగిలిన చేనేతకార్మికులు మాస్టర్ వీవర్లవద్ద పనిచేస్తున్నారు"

"ఈ చేనేత కార్మికులకు కార్మికసంక్షేమ పధకములైన కనీసవేతనంగాని, ప్రావిడెంటు ఫండ్‌గాని, బోనస్‌గాని ప్రభుత్వం ఇంత వరకు వర్తింపజేయలేదు. ఇది చాలా అన్యాయం.

"చేనేత కార్మికులకు కనీసవేతననిర్ణయం లేకపోవుటవలన మాస్టర్‌వీవర్ల దయా దాక్షిణ్యాలపై ఆధారపడి చాలీ చాలని వేతనముతో దుర్భరంగా జీవించవలసి వస్తున్నది."

"చేనేత కార్మికులకు ప్రావిడెంటుఫండ్ చట్టం వర్తింపజేయకపోవుటవలన శరీర పటుత్వం వున్నంతవరకు శ్రమించి శక్తి ఉడిగిన తర్వాత పోషించే దిక్కులేకవారు హీనాతిహీనమైన చావు చావవలసివస్తున్నది."

"20 మంది పైబడి పనిచేసే ప్రతి యూనిట్‌లోని వర్కర్సుకి బోనస్సు యివ్వాలని ప్రభుత్వ చట్టంలో నిర్దేశించింది. లాభ నష్టాలతో నిమిత్తం లేని పక్షాన 4 శాతం కనీస బోనస్ యివ్వాలని కూడా వున్నది. కాని 20 మంది పైబడి తనవద్ద పనిచేస్తున్నప్పటికి ఏమాస్టర్ వీవరు చేనేత కార్మికులకు బోనస్ ఇచ్చుటలేదు."

"ప్రాధమికమైనవి. కనీసం అమలు జరపవలసినవి. అయిన ఈ కార్మిక సంక్షేమ పధకాలను చేనేత పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం వెంటనే వర్తింపజేసి అమలు జరపాలి" (పివి)

బైఫర్ కేటెడ్, హయ్యర్ సెకండరీ కోర్సుల భవితవ్యం

రాష్ట్రప్రభుత్వ విద్యావిధానం తీరుపై

గుంటూరుగోష్ఠిలో శ్రీ పి. శ్రీరామమూర్తిసమీక్ష

(11 సంవత్సరాల పాత సెకండరీ విద్యా విధానంలో 9,10,11 తరగతుల్లో గల బైఫర్ కేటెడ్ కోర్సులను తీసివేయాలని 10 సంవత్సరాల సెకండరీ విద్యా విధానమునంగీకరించి 11 12 తరగతుల హైయ్యర్ సెకండరీ దశను 1969 జూన్‌నుండి జూనియర్ కాలేజీలుగా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుటద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలపై గుంటూరులోఆంధ్ర ప్రదేశ్ టీచర్సు యూనియన్ పక్షాన యీ మాసం 21వ తారీఖు ఆదివారం ఉదయం 10 గంటలకు హిందూకాలేజీ మల్టీపర్పస్ స్కూలులో విద్యాగోష్ఠి ప్రారంభం అయింది. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి శ్రీ పి. శ్రీరామమూర్తి (ఎం ఎల్ సి.) చదివిన వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం. —సం)

సంయుక్త మద్రాస్ రాష్ట్రములో శ్రీ అవినాశలింగం చెట్టియార్ విద్యా మంత్రిగా నున్నపుడు 1949 లో నూతన సెకండరీ విద్యా పథకం అమలులోనికి వచ్చినది. చరిత్ర, భూగోళం బదులు సాంఘికశాస్త్రము ప్రవేశపెట్టబడినది. సెకండరీ విద్య. కాలేజి విద్యకు సోపానముగాను, దీనియందు ఉత్తీర్ణులైనవారు జీవితమున ప్రవేశింప దలచినచో. జీవనవృత్తిని కల్పించునదిగాను యుండాలన్న ద్వివిధ ఆశయముతో "ఎకడమిక్ కోర్సులు" "బైఫర్ కేటెడ్ కోర్సులు" గల సెకండరీ విద్యా పథకము వుండాలని నిర్ణయమైనది. దీనినే 1949 యస్. యస్. యల్.సి స్కీము అంటారు.

సాధారణముగా ఎకడమిక్ కోర్సులతో స్కూలు ఫైనల్ పరీక్షయందు ఉత్తీర్ణులైన వారు కళాశాల విద్యను కొనసాగించుతారని బైఫర్ కేటెడ్ కోర్సులను (9 10. 11 తరగతుల్లో) తీసుకొన్నవారు స్కూలు ఫైనల్ పరీక్ష ప్యాసయిన తర్వాత చేతి వృత్తుల నైపుణ్యం సంపాదించి జీవితమున ప్రవేశింపుదురని. ఆశించబడింది కాని వీరిలో కొందరు పాలిటెక్నిక్స్‌లో ప్రవేశించుట కూడ జరిగినది. ఎకడమిక్ కోర్సులతోపాటు సవాలు గుమస్తాలుగ ఉద్యోగ జీవితమున ప్రవేశించిన వారు పెక్కురు గలరు. తరువాత 1952లో కేంద్ర ప్రభుత్వముచే నియమింపబడిన శ్రీ లక్ష్మణస్వామి మొదలియార్ సెకండరీ విద్యా కమిషన్ సమర్పించిన సిఫార్సులు ప్రధానమైనవి. - 11సంవత్సరాల సెకండరీదశ 12సంవత్సరాల హైయ్యర్ సెకండరీ దశ. సెకండరీ దశకు చేర్పబడిన ఈ ఒక సంవత్సరం హైయ్యర్ సెకండరీ దశకు ప్రత్యామ్నాయ ఏర్పాటే కళాశాలల్లో ఒక సంవత్సర పి. యు సి కోర్సు. హైయ్యర్ సెకండరీ స్కూళ్ళలో 9, 10, 11, 12 తరగతుల్లో బైఫర్ కేటెడ్ కోర్సు లున్నచోట వాటిని మల్టీపర్పస్ స్కూళ్ళని పిలుస్తారు. అనగా శ్రీ అవినాశలింగంచెట్టియార్ విద్యాపథకంలో మూడేండ్లు (9, 10, 11 తరగతులు) మాత్రమే బైఫర్ కేటెడ్ కోర్సులు బోధింపబడుటకు వీలుండగా శ్రీ లక్ష్మణస్వామి మొదలియార్ స్కీములో నాల్గేండ్లు బోధింపబడుటకు వీలు కల్పింపబడింది.

శ్రీ లక్ష్మణస్వామి మొదలియార్ అన్న రాష్ట్రమైన మద్రాస్‌లో ఆయన సిఫార్సులు ఆమోదింపబడి అమలు జరపబడకపోయినా ఆంధ్ర ప్రదేశ్‌లో హైయ్యర్ సెకండరీ. మల్టీ పర్పస్ స్కీములు అమలు జరుపబడుచున్నవి

1964 లో కేంద్ర ప్రభుత్వముచే నియమింపబడిన డాక్టర్ డి. యస్. కొఠారి నాయకత్వాన విద్యాకమిషను 1966 లో తమ నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో ఇందుకు సంబంధించిన విషయాలిలా వున్నాయి.

మొదటి 10 తరగతుల వరకు సెకండరీ విద్యాపథకము దీని తర్వాత రెండేళ్ళ హైయ్యర్ సెకండరీ విద్యా పథకము

సాధారణ విద్యను, చేతివృత్తుల విద్యను కలగాపులగం చేయరాదని రెండింటిని వేరు వేరుగా బోధించాలని కొఠారి కమీషను వారు స్పష్టం చేశారు 7 వ తరగతి తర్వాత (ప్రస్తుతమున్న జూనియర్ టెక్నికల్ స్కూల్ల మాదిరిగా) 10 వ. తరగతి తర్వాత (ప్రస్తుత పాలిటెక్నిక్లు. ఐ టి. ఐ మాదిరిగా) వేరే టెక్నికల్ కోర్సులను బోధింపవలెనేగాని 9, 10, 11, 12 తరగతులలో ప్రస్తుతం ఆంధ్ర దేశంలోవున్న మాదిరిగా బైఫర్ కేటెడ్ కోర్సులు లేక మల్టీపర్పస్ కోర్సులను ఏర్పాటు చేయరాదని స్పష్టపరచినారు. 10 తరగతులు సాధారణ సమాన సెకండరీ విద్యా పథకాన్ని అందరు విద్యార్థులకు అమలు జరపాలని ఈ కమీషను అభిప్రాయపడినది. అయితే ఈ సాధారణ సెకండరీ విద్యా పథకములో సైన్సుకు, పని అనుభవానికి ప్రాధాన్యత వుండాలని కొఠారి విద్యా కమీషను నిర్దేశించింది. ఈ పని అనుభవం ద్వారా విద్యార్థులు చేతివృత్తుల్లో నైపుణ్యము సంపాదించే వారినిగా తయారుచేయాలన్న ఆశయంతోగాక శారీరక శ్రమపట్ల అనురక్తి గౌరవము పెంపొందింపజేయుటకు, ఇదిలో యింటిలో, పొలములో, ఫ్యాక్టరీలలో ఉత్పత్తి కార్యక్రమాలలో విద్యార్థిని భాగస్వామిచేయుటకు ఉద్దేశింపబడినది.

ఈలోగానే మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము బైఫర్ కేటెడ్. మరియు హైయ్యర్ సెకండరీ కోర్సులను గూర్చి కొన్ని నిర్ణయాలు చేసినది.

బైఫర్ కేటెడ్ కోర్సులు

రాష్ట్ర విద్యాశాఖ జారీచేయబడిన జి. ఓ. 1911 తేది 13 6 67 ద్వారా 67.68 విద్యా సంవత్సరమునుండి నూతన 8 వ తరగతిలో బైఫర్ కేటెడ్ కోర్సులను విద్యార్థులు ఎన్నుకొనుటగాని బోధించుటగాని జరుగదని తెలుపబడింది అనగా 68 69 లో నూతన 9 వ తరగతిలోను 69 - 70 లో నూతన 10 వ తరగతిలోను ఈ కోర్సులు బోధింపబడవు

అయితే ఆంధ్ర ప్రాంతంలోగల 56 మల్టీపర్పస్ స్కూళ్ళు 17 హైస్కూళ్ళలో ప్రస్తుతము యీ కోర్సులు బోధిస్తున్న దాదాపు 500 మంది టీచర్ల భవిష్యత్తును గూర్చిగాని. ఈ 73 స్కూళ్ళలోగల సుమారు కోటిరూపాయల విలువచేసే పరికరాలనుగూర్చిగాని. యే నిర్ణయము ప్రభుత్వము చేయలేదు. ఇంజనీరింగ్, వ్యవసాయము, టైపు. డ్రాయింగు మొదలగు విషయాలకు సంబంధించిన ఖరీదుగల పరికరాలిందు వున్నాయి

ఈ బైఫర్ కేటెడ్ కోర్సులను రద్దుచేయాలని ప్రభుత్వము తలంచినపుడు ప్రత్యామ్నాయముగా టెక్నికల్‌స్కూళ్ళనుఏర్పాటు చేయుటకు పూనుకోవలసినది. అందుకూ పూనుకోలేదు. కొఠారి కమిషను సిఫార్సులననుసరించి "పని అనుభవము"ను కనీసము ఈ 73 స్కూళ్ళలోను ఉన్న టీచర్లు. పరికరాలతో ఏర్పాటు చేయుటకు పూనుకోలేదు

హైయ్యర్ సెకండరీకోర్సు

కొఠారి విద్యాకమిషనువారు హైయ్యర్ సెకండరీ కోర్సులను రెండేళ్ళుగా చేయాలని కళాశాలలనుండి పి. యు సి. కోర్సును ఉపసంహరించి సెకండరీ స్కూళ్ళకు జత పర్చాలని సిఫార్సు చేశారు.

మన రాష్ట్ర ప్రభుత్వము ఏర్పాటుచేసిన హైదరాబాద్ సమావేశంలో పి. యు సి. మరియు హైయ్యర్ సెకండరీ కోర్సులు కొంతకాలం యిలాగే కొనసాగాలని. ప్రత్యేకముగా రెండేళ్ళ కోర్సుతో జూనియర్‌కాలేజీలు ప్రారంభించుటకు వీలుండాలన్న విధానము ఆమోదింపబడింది. అయితే వీటన్నింటిలోను వివిధ కోర్సులు (సైన్సు, ఆర్ట్సు వగైరా) సమాన విలువ కలిగి యుండాలని పరీక్షలు నిర్వహించుటకు రాష్ట్రమంతకు విద్యాశాఖ మరియు విశ్వవిద్యాలయాల ప్రతినిధులు గల ఒక సంయుక్త బోర్డు వుండాలని కూడా అంగీకరింపబడింది.

కాని ఈ మధ్యనే హైదరాబాద్‌లో విశ్వవిద్యాలయాల ప్రతినిధులు. విద్యాశాఖ ప్రతినిధులు, విద్యా మంత్రి, ముఖ్యమంత్రి ప్రభృతులు హాజరైన సమావేశములో హైయ్యర్ సెకండరీ స్కూళ్ళను 10 ఏండ్ల సెకండరీ స్కూళ్ళుగా వేరుగాను. రెండేళ్ల యింటర్మీడియట్ కోర్సులో జూనియర్ కాలేజీలు వేరుగాను ఏర్పాటు చేయాలని నిర్ణయింపబడినది.

ఈ నిర్ణయాన్ని అమలు జరుపుటకుగాను విద్యాశాఖ డైరెక్టరు జిల్లా విద్యాశాఖాధికారులకు పంపిన ఉత్తర్వులమేరకు వారు ఆ యా జిల్లాలలో గల హైయ్యర్ సెకండరీ, మల్టీపర్పస్ పాఠశాలలను తనిఖీ చేసి ఏవేవి జూనియర్ కాలేజీలుగా మార్చవచ్చునో సిఫార్సు చేసినట్లు తెలియుచున్నది. ప్రస్తుత హైయ్యర్ సెకండరీ పాఠశాలలను నిర్వహిస్తున్న మేనేజిమెంట్లే ముందు కూడా జూనియర్ కాలేజీలను నిర్వహిస్తాయి. కాని, ఈ జూనియర్ కాలేజీలు యూనివర్శిటీలకు అనుబంధము చేయబడతాయి

జిల్లా విద్యాశాఖాధికార్లు తనిఖీ చేసిన విషయాలలో 80 మంది విద్యార్థులు కూర్చొనేందుకు వసతిగల హాలు (హైయ్యర్ సెకండరీ అయితే సెక్షనుకు 55 మంది విద్యార్థులే వుంటారు) వున్నదా? లేదా? ఫిజిక్సు, కెమిస్ట్రి, బోటనీ వగైరా ప్రత్యేకముగా సైన్సు విభాగాలను బోధించుటకు వీలుగల లేబరేటరీ వున్నదా? లేదా? అనునవి వున్నాయి.

ఒకే ఆవరణలో 10 తరగతుల సెకండరీ స్కూలు, రెండేళ్ళ కోర్సుగల జూనియర్ కాలేజీ వున్నపుడు దానికి ప్రత్యేకముగా ప్రధానోపాధ్యాయుని దానికి ప్రత్యేకముగా ప్రధానాచార్యుని నియమిస్తారా? లేదా? మూడవ తరగతి యం. ఎ వర్గ రా పోస్టు గ్రాడ్యుయేట్ [illegible] టీచర్లు [illegible] గ్రాడ్యుయేట్ డిప్లొమా [illegible] సెకెండరీ టీచర్లు భవిష్యత్తు? జూనియర్ కాలేజీలో పనిచేయు టీచర్లకు యు. జి. సి. స్కేళ్ళను అమలు జరుపుతారా? అన్ని విషయములు తెల్పబడలేదు. ఈ మార్పువల్ల రిట్రెంచిమెంటు వచ్చే ప్రమాదమున్నది.

ఊసరవెల్లి సోషలిస్టు

కాంగ్రెస్ అధ్యక్షుడూ కమ్ మైసూరు ముఖ్యమంత్రీ అయిన శ్రీమాన్ నిజలింగప్ప ఢిల్లీలో తనకార్యకలాపాలు ప్రారంభించారు కాంగ్రెస్ అధ్యక్ష పీఠానికి ఆయన ససేమిరా ఇష్టపడకున్నా పగ్గాలు వేసి పట్టుకువచ్చిన వ్యక్తి అనేది సర్వవిదితమే.

తన కాంగ్రెస్ దర్బారుకు సంబంధించిన నామినేషన్ల జాబితాను ప్రకటించేందుకై గత మంగళవారం సాయంత్రం ఆయన రెక్కలు గట్టుకొని ఢిల్లీ ఎగిరివెళ్ళారు "మైసూరు హౌస్"లో కూర్చుని వ్యవహారమంతా పరిష్కరించుకొన్నారు.

అయితే, ఇక్కడవున్న ప్రశ్నల్లా ఏమిటంటే కాంగ్రెస్ అధ్యక్షునికి కేటాయించిన భవనానికి శ్రీ నిజలింగప్ప ఎందుకుతరలి వెళ్ళలేదు ? ఆ భవనాన్ని శ్రీ కామరాజ్ ఏనాడో ఖాళీచేసివున్నారు కూడా. దీనికి ఆయన చెప్పే సమాధానం ఏమంటే ఆ భవనానికి అద్దె చాలా భారీమొత్తమని. (ఎంతో కాదు నెలకు రు 3300 మాత్రమే) అతిపేదదైన కాంగ్రెస సంస్థ ఇంత పెద్ద మొత్తం కూడిన ఆ భవనాన్ని భరించలేదని. పైగా ఎ. ఐ. సి. సి ఆ భవనానికి అద్దె చెల్లించదనీను...

అలా అయినప్పుడు 1964 నుండి శ్రీ కామరాజ్ ఈ భవనాన్ని ఎలా భరించినట్లు? ఇంతకాలంబట్టీ ఈ భవనం అద్దెను సదోబా పాటిల్ భరిస్తున్నట్లు పాత్రికేయులొకరు చెప్పారు. మరి ఈ మొత్తాన్ని శ్రీ పాటిల్ సహాయము తన స్వంతసొమ్ము నుండే భరించేవారా? ఏమో మరి. ఈ ప్రశ్నను ఇలాగే వుండనిద్దాం.

నిజలింగప్ప బొంగరం లాంటివారు ఒక చిన్న పట్టణ నాయకునేత. అసంఖ్యాకమైన సమస్యలతో ఇప్పటికే గింగిరాలు తిరుగుతున్నవ్యక్తి. కాంగ్రెస్ అధ్యక్ష పదవి పుణ్యమా అని ఆయనకు నిద్రలోసైతం శాంతి లభించడం లేదని తెలిసినవారు చెప్పుకుంటున్నారు. ఒకనాడు అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్ష పీఠమెక్కి, రాష్ట్రంలో సర్వాధికారిగా ఒక వెలుగు వెలిగిన [illegible] లాంటి ముఖ్యమంత్రి పదవిని శాశ్వతంగా పోగొట్టుకొన్న శ్రీ సంజీవరెడ్డి భూతంకలలో సైతం కనిపిస్తూ శ్రీ నిజలింగప్పను కలత పెడుతున్నదట!

గత మాసంలో సి. బి. గుప్తా పాటిల్ అండ్ కంపెనీ. ప్రధాని భవనంలో అర్ధ రాత్రి గూడుపుఠాణీ జరిపి ఉచ్చులువన్ని బిగపట్టి శ్రీ నిజలింగప్పను కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అభ్యర్థిగా ఇరికించినప్పుడు. తన యిష్టమున్నంతకాలం కాంగ్రెస అధ్యక్షపదవికి. మైసూరు ముఖ్యమంత్రి పదవికి ఏకచ్ఛత్రాధిపత్యం వహించవచ్చునని నిజలింగప్పకు హామి యిచ్చారు.

ఈ హామీహామీగా, ఉండగానే ఇంతలో శ్రీ కామరాజ్ పిడుగుపాటుగా ఒక ప్రకటన చేశారు. ముందుగా గాకపోయినా హైదరాబాద్ కాంగ్రెసు మహాసభల అనంతరం తక్షణమే "తన మనిషి" శ్రీ నిజలింగప్ప ముఖ్యమంత్రి పదవికి తిలోదకాలివ్వాలని పాత్రికేయులకో ఢంకా బజాయించి చెప్పారు.

దీనితో శ్రీ నిజలింగప్ప ఆశకాస్తా నిరాశ అయింది. పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టు తాను ఏప్రిల్ వరకూ మైసూరు ముఖ్యమంత్రి పదవిలో వుంటానని వ్యంగ్యంగా చెప్పారు.

మరి, ఈ మధ్యకాలంలో జరిగిందేమిటి? అను శెట్టి లాంటి శెట్టి పీఠ వదలించుకొని తన సాటిలింగాయతుడు శ్రీ వీరేంద్ర పాటిల్‌ను తన వారసుడుగా ఏకగ్రీవంగా ఎన్నిక చేయించుకొనడం శ్రీ నిజలింగప్ప [illegible] స్పష్టం. భరతుడు రాముని పాదుకలను పట్టాభిషేకం చేసి, శ్రీరాముని రాకకై అయోధ్యలో వుంచి. ఆ సింహాసనాన్ని రక్షించి శ్రీ రామునికి వదిలంగా భక్తి ప్రపత్తులతో అప్పజెప్పిన రీతిగానే తన ముఖ్యమంత్రి పీఠాన్ని శ్రీవీరేంద్ర పాటిల్ అతి జాగ్రతగా కాపాడి తనకు తిరిగి అప్పగించగలడని (శ్రీ బ్రహ్మానందరెడ్డి లా కాకుండా) శ్రీ నిజలింగప్ప ఊహ.

ఇది ఇలావుండగానే. పులిమీద పుట్రలా పశ్చిమ బెంగాలో నయా పిరాయింపువార్త సమస్య శ్రీ నిజలింగప్పను ఎదుర్కొంది. "ధార్మికత రహితమైన" ప్రతిపక్ష పార్టీలపై [illegible] పెరుగుల పర్షించిన ఆ సూన పలుకుబడి [illegible] నానికి దలారి నేలేప ఇంతలో తన స్వంత పార్టీలోని ముసలం ఎట్టిదన్న వార్తలు ఎన్నో. ఎంతో ఎంతటి యాంటి క్లైమాక్స్! హతోస్మి!

ఈ గొడవ కంటావెనుక శ్రీ పి. సి సేన్ అన్నట్లు "మైసూరు హౌస్" ప్రాంగణంలో పుకార్లు వ్యాపించాయి. సహాయనిధికి సంబంధించిన భారీ మొత్తాలను కైంకర్యం చేశారనే ఆరోపణపై శ్రీ సేన్ తాను ముఖ్యమంత్రిగావున్న సమయంలో అరెస్టు చేయించిన శ్రీ అతుల్యఘోష్ నేడు బెంగాల్‌లో 31 మంది తిరుగుబాటు కాంగ్రెస్ సభ్యులకు నాయకుడు! పైగా అతుల్యఘోష్ తోక తెగగొట్టడానికి అతుల్య ఘోషే సమర్థుడని వారి వాదం!

ఈతాజా తిరుగుబాటుపట్ల శ్రీమతి ఇందిరా గాంధికి సైతం ఏదో ఒక మూల కొద్దిపాటి సానుభూతి లేక పోలేదని కూడా అక్కడక్కడా మాటలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నూతన కార్యవర్గంలో అతుల్యఘోష్‌కు స్థానం వుండరాదని కొంతమంది కోరారు కూడా!

ఇక శ్రీమతి ఇందిరాగాంధి - నిజలింగప్పల మధ్య సంబంధాల గురించి ఆలోచిద్దాం. కాంగ్రెస్ నూతన కార్యవర్గంలో క్రియాకుశలి దినేష్‌సింగ్. యం. యం. దీక్షిత్‌లకు స్థానం కల్పించవలసినదిగా ఆమె హైదరాబాద్‌లో కాంగ్రెస్ నూతన అధ్యక్షుణ్ణి ప్రాధేయపడింది. దాని కాయన తల పంకించి మందహాసం చేయడం మినహా మాట మాటాడలేదు.

అటు పిమ్మట కాంగ్రెస్ కార్యవర్గానికి ఏడుగురు సభ్యుల అధికార జాబితాను రూపొందించారు. పాపం దినేష్‌సింగ్ పేరు కంచు కాగడా పెట్టి గాలించినా ఆ జాబితాలో కనిపించ లేదు.

అంతటితో శ్రీమతి ఇందిరాగాంధి ఆ ప్రస్తావన వదిలిపెట్టలేదు. శ్రీ నిజలింగప్పను అధ్యక్షపీఠానికి ఎక్కించిన పెద్దల్లో ఒకరైన శ్రీ సి. బి గుప్తాను సైతం ప్రాధేయపడింది. ఎలాగోఒకలాగ శ్రీ దినేష్‌సింగ్ కాంగ్రెస్ కార్యవర్గానికి ఎన్నికయ్యేలా చూడమని. అయితే ఆయన కూడా భావగర్భితంగా అయినా నిర్మొహమాటంగా చెప్పారు తానీ విషయంలో ఏమీచేయజాలనని అధికార జాబితాను ప్రధానంగా శ్రీ సి బి. గుప్తా, చావన్‌లే ప్రతిపాదించారు. దీనికి శ్రీ నిజలింగప్ప, ఇతరులంతా ఆశీర్వాదాలు యిచ్చారు.

శ్రీ సిద్దవ్వనహల్లి నిజలింగప్ప ఎలాంటి తరహా మనిషి? ఆయన జీవిత సంగ్రహాన్నంతా 16 పేజీల్లో పదిలపరచి హైదరాబాద్ కాంగ్రెసు మహాసభలో అహూతులందరికీ పంచిపెట్టారు.

"మారుతున్న ఆధునిక ప్రపంచంలో నూతన భావాలకు అనుగుణ్యంగా ఎటువడితే అటు మారడానికి. [illegible] ఆయన మనస్సు పెట్టిందిపేరు" అని ఆ జీవిత సంగ్రహంలో ఒక వాక్యం వుంది.

నిజంగా శ్రీ నిజలింగప్ప ఎటువడితే అటు మారగల ఊసరవెల్లిలాంటి వస్తాదుడూ. ఏదేమైనాను. కాకుంటే ఇటీవలనే ఆయన వేలాది ఎకరాల భూమిని బిర్లాలకు నామ మాత్రపు ధరకు ధారాదత్తం చేశారు.

గత మార్చిలో ప్రధాని పదవికి మురార్జీ. ఇందిరాగాంధి మధ్య పోటీ అనివార్య మనుకున్నపుడు ప్రధాన మంత్రి ఇందిరా గాంధీకి శ్రీ నిజలింగప్ప సహాయం గురించి ప్రచారం చేయడానికి తన స్వీయవిమానంలో హుటాహుటిని మైసూరుకు తరలి వెళ్ళిన వ్యక్తి శ్రీ కె. కె. బిర్లా యేనని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం కుతూహలం కలిగించే విషయం.

గుత్త పత్రికల యజమాని శ్రీ రామనాథ్ గోయంకా అంటే శ్రీ నిజలింగప్పకు ప్రత్యేక అభిమానమూ, భక్తిశ్రద్ధలూ వున్నాయి. మైసూరునుండి "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" పత్రికను నడిపేందుకుగాను 1963.64 లో శ్రీ రామనాథ్‌కి శ్రీమాన్ నిజలింగప్ప మైసూరు విధాన సౌధం సమీపానగల 2700 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు.

తన నిరంకుశ చేష్టలను విమర్శనాత్మక దృష్టితో చూసే స్థానిక పత్రికపట్ల శ్రీ నిజలింగప్ప కన్నెర్ర చేశారు కూడా. అందువల్లనే ఆయన ఆ గుత్త పత్రికల యజమానిని తన ఆస్థానానికి తరలించుకొన్నారు

ఆ స్థలం ఖరీదు చదరపు గజం 18 వందల రూపాయలుండగా శ్రీరామనాథగోయంకాకు చదరపు గజం 1 కి రు 40.78 పైసలకు శ్రీ నిజలింగప్ప ధారాదత్తం చేశారు. దీనిపై ఆ రాష్ట్రంలో ఎంత సంచలనం కలిగినా శ్రీ నిజలింగప్ప మాత్రం తొణకనూలేదు. బెణకనూ లేదు. విస్మయుం వీరేంద్రపాటిల్ మిన్నకున్నారు. అంతేగాక మరో 3282 చదరపు గజాల భూమిని శ్రీ గోయంకాకు ఉచితంగా యిచ్చి దానంచేశారు. ఆధునిక భావాల పట్ల ఎదే పర అంటే బహుశా ఇలాంటిదే నేమో!

దీనిపై స్థానిక పత్రిక హైకోర్టులో దాఖలు చేసిన కేసు కేవలం సాంకేతిక కారణాలతో ఓడిపోవడంతో ఈ గొడవ అడుగుపడింది.

కాంగ్రెసు సోషలిజం గురించి - దాని అర్థమేదైనా కావచ్చుగాక - శ్రీ నిజలింగప్పకు ఒక ప్రత్యేకాభిప్రాయమేదీ లేకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఆయన జీవితసంగ్రహం వ్రాసినవారికి ధన్యవాదాలు చెప్పుకుంటూ ఆయనను మాత్రం మనం "ఊసరవెల్లి సోషలిస్టు"అని పిలుద్దాం.

—అంతర్వేది

లేఖలు

గుంతకల్లులో కళాశాల నిర్మాణానికై డిమాండ్

అర్యా,

1965 సెప్టెంబరులో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి అప్పుడు మా గుంతకల్లుకు కళాశాల కావాలనే దీక్షతో. అన్ని రాజకీయ పార్టీలు. అన్ని వర్గాల పెద్దలూ. ప్రజలూ ఏకమై ఒక ఒప్పందానికి వచ్చారు. ప్రతి కౌన్సిల్ సీటుకూ జనరల్ స్థానానికి రు. 5000/- లు రిజర్వుడు స్థానానికి రు. 1250/- లు యిచ్చిన వారికి సీట్లు యివ్వాలని తీర్మానించారు. అందరూ వారికి కట్టుబడి సహకరించారు. అలాగే నామినేషన్ గడువులోపల డబ్బును కట్టినవార్ని తప్ప యితరులు నామినేషన్లు వేయకుండా అందరి సహకారంతో తగు జాగ్రత్తలు తీసుకొన్నారు. నామినేషన్ల గడువు పూర్తయ్యింది. దురదృష్టవశాత్తు అధికారికంగా ప్రకటించకముందే పాకిస్తాన్‌తో యుద్ధంరావడం ఆ ఎన్నికలు రద్దుకావడం జరిగింది.

ఆ విధంగా వసూలైన డబ్బు రు. 1,21,250/- లు ఆంధ్రా బ్యాంకులో జమకట్టబడి యుండెను. దానినే ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి, శ్రీ సంజీవరెడ్డి, శ్రీ తిమ్మారెడ్డి స్థానిక కాంగ్రెస్ ఆఫీసు ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు సమర్పించే యేర్పాట్లుచేసి కాలేజీ స్థాపించమని కోరినాము. అందుకు ముఖ్యమంత్రి అప్పటి అత్యవసర పరిస్థితిలో కాలేజీ స్థాపించటం సాధ్యంకాదని ప్రజలే స్వయంగా ఇవ్వనున్నడబ్బుతో కాలేజీ ప్రారంభిస్తే పూర్తి సహకారం గవర్నమెంటు నుండి వుంటుందని సెలవిచ్చారు. డబ్బు తీసుకోలేదు. అప్పటినుండీ మా పెద్దలూను. [illegible] విరాళ మిచ్చిన దాతలూను [illegible]. ఏదయితేనేం అత్యవసరపరిస్థితిలో [illegible] దీక్షతో కమిటీలు. కమిటీలనే మార్చి. బైలాలు. బైలాలనే మార్చి, ఆంధ్రాబ్యాంకు నుండి ఆ పైకం అన్నీగా తీసుకుని అందరికీ పంచిపెట్టి అందుకు ప్రాంతీయులు కూడా ఆమోదించుచున్నట్లు నిరూపించి వుంది. డబ్బు వాపస్‌తీసుకోవడం. మరలా కట్టిక పోవడం వల్లనూ ముందు ముందు వసూళ్ళకు ప్రతిబంధకం యేర్పడి మా కాలేజీ శకం ముగించబడింది.

కావున ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రి విద్యాశాఖాధికార్లూ. ఆంధ్రాబ్యాంకు అధికారులూ యీ అక్రమాన్ని విచారించి. అందుకు సరియైన చర్య తీసుకుని అందరిపైనా ఒత్తిడితెచ్చి పరువు డబ్బు ఎవరిలా బ్యాంకులో కట్టులాకుమాస్తే ముందు ముందు మరలా కొత్త వసూళ్ళు లేని ప్రభుత్వ సహాయం లేకుండానే కాలేజీ నడవడానికి మా గ్రామ పెద్దలంతా సిద్ధంగా వున్నారని విన్నవించుకుంటున్నాము. కనుక ముఖ్యమంత్రి యీ విషయమై సత్వర చర్య గైకొంటారని ఆశిస్తున్నాము.

ఇట్లు,
జి వీరన్న,
19/50 ఏ పాతగుంతకల్.

నర్సాపురంలో మున్సిపల్ ఎన్నికల సంరంభం

నర్సాపురం జనవరి 22

పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురం పట్టణ మున్సిపల్ ఎన్నికల సంరంభం ప్రారంభమయ్యింది

ఏప్రిల్ 1 వ తేదీన కొత్త కౌన్సిల్ ప్రమాణస్వీకారం చేయవలసి వున్నది ఫిబ్రవరిలో నామినేషన్లు. మార్చిలో ఎన్నికలు జరుగగలవని భావించబడుతున్నది.

1961 వ సంవత్సరం తర్వాత 7 ఏళ్ళకి జరిగే ఈ ఎన్నికలు ఎంతో ఆసక్తిగా జరుగుతాయని భావించ బడుతున్నది.

ప్రస్తుత కౌన్సిల్ 7 ఏళ్ళ పరిపాలనలో పట్టణ అభివృద్ధి మందగించిందని. ప్రభుత్వాన్ని వత్తిడిచేసి గ్రాంట్లు తెచ్చుటలో ఘోరంగా విఫలమయ్యిందని ఇక్కడ భావించబడుతున్నది.

భీమవరం మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

భీమవరం, జనవరి 22

పశ్చిమ గోదావరిజిల్లా భీమవరం మునిసిపాలిటీ 1968-69 సంవత్సరం బడ్జెట్ డిసెంబరు 29 వ తారీఖు జరిగిన సమావేశంలో ఆమోదించబడినది. ఛైర్మన్ శ్రీ వెంకటస్వామి అధ్యక్షత వహించారు.

సాగర్ ఇంజనీర్ల రిట్రెంచ్‌మెంటు వ్యతిరేకంగా ఆందోళన

విజయపురి, జనవరి 20

నాగార్జునసాగర్‌డామ్, కెనాల్స్, ఎంక్వైరీ సిటీ సూపర్‌వైజర్లు, జూనియర్ ఇంజనీర్లు, సుమారు 400 మంది హిల్‌కాలనీ హైస్కూలులో సమావేశమై ప్రభుత్వం అవలంబిస్తున్న రిట్రెంచ్‌మెంటు విధానాన్ని నిరసిస్తూ తీర్మానం చేశారు.

సాగర్‌వద్దపనిచేస్తున్న సూపర్‌వైజర్లను జూనియర్‌ఇంజనీర్లను రిట్రెంచ్ చేయకుండా ఆపుచేయాలని. హైదరాబాదులోని ఇంజనీర్ల సంయుక్త కార్యాచరణ సమితితో సంప్రదించిగాని కార్యక్రమం చేపట్టబోమని కూడా తీర్మానించారు.

ఒకవేళ ప్రభుత్వం - రిట్రెంచ్‌మెంట్ కార్యక్రమం కొనసాగిస్తే-అందరు సభ్యులూ ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని నిర్ణయించుకొన్నారు

వైద్య ఉద్యోగుల నాయకుని నిరవధిక నిరశనదీక్ష

విశాఖపట్నంలో

విశాఖపట్నం, జనవరి 22

విశాఖజిల్లా వైద్య ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయినందున ఎన్ని విజ్ఞప్తులు చేసినా పైఅధికార్లు ఏమీ పట్టించుకొనందుకు నిరసనగా ప్రత్యక్షచర్యకు ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్టణం బ్రాంచివారు సిద్ధమైనారు

యిందుకు మొదటిదశగా విశాఖజిల్లా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి, శ్రీ సి. రామారావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట యీ నెల 25 నుండి నిరవధిక నిరాహారదీక్ష వహించనున్నారు.

అప్పటికి అధికారవర్గం కదలకుంటే రాష్ట్రవ్యాపితంగా అన్ని కార్మిక సంఘాల సహకారంతో మరింతబలమైన పోరాటానికి సిద్ధమౌతూ—అందరి సహాయ సహకారాలు అర్థిస్తున్నారు.

దక్షిణాదిన టీ ఉత్పత్తి తగ్గుదల

కొచ్చిన్. జనవరి 22

1967 లో దక్షిణ భారతదేశంలో గత సంవత్సరంతో పోల్చిచూస్తే టీ ఉత్పత్తి 45 లక్షల కిలోగ్రాములు తగ్గింది.

1966 లో 9 కోట్ల 54 లక్షల ఉత్పత్తి కాగా 1967 లో 9 కోట్ల 8 లక్షలకు టీ ఉత్పత్తి పడిపోయింది.

సోవియట్ జపాన్‌ల మధ్య సంప్రతింపులకై ప్రతిపాదన

వియత్నాం సమస్యపై :

టోక్యో, జనవరి 22

వియత్నాంలో శాంతిసాధనకు సోవియట్ యూనియన్, జపాన్ అధికారసంప్రతింపులు ప్రారంభించాలని జపాన్ విదేశాంగమంత్రి టాకిమోమికి ఒక ప్రతిపాదన చేసినట్లు జపాన్ విదేశాంగమంత్రిత్వశాఖ నేడు తెలియజేసింది.

జపాన్‌లోపర్యటిస్తున్న సోవియట్ యూనియన్ డిప్యూటీ ప్రధాని నికోలయ్ బైబకోవ్‌కు గత శనివారంనాటి పై ప్రతిపాదన చేసినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి. పత్రికలోవచ్చిన వార్తను ధృవపరుస్తూ తెలియజేశారు.

టోక్యోకి 60 మైళ్ళ దూరంలో గల ఆరోగ్యకేంద్రం హాకోన్‌లో విందు సందర్భంగా జరిగిన సమావేశంలో పైప్రతిపాదన చేసినట్లు ఆయన చెప్పారు.

శ్రీశైలంలో నటరాజ రామకృష్ణకు సన్మానం

శ్రీశైలం. జనవరి 20

శ్రీశైలం ప్రాజెక్టు సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన యీ మాసం 8వ తారీఖు - ప్రాజెక్టు ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రఖ్యాత నృత్యకళా ప్రవీణుడు శ్రీ నటరాజ రామకృష్ణకు ఘనమైన సన్మానం జరుపబడింది.

సాంస్కృతిక సమితి అధ్యక్షుడు శ్రీ నందివాడ భీమారావు సభికులకు శ్రీ నటరాజ రామకృష్ణను పరిచయం చేశారు.

ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు శ్రీ కె. వి. శ్రీనివాసరావు శ్రీ నటరాజ రామకృష్ణ కళానైపుణ్యాన్ని గూర్చి ఎంతో ప్రసంగించారు.

తదనంతరం శ్రీ నటరాజ రామకృష్ణ తనకు చేసిన సన్మానానికి కృతజ్ఞత తెలుపుకుంటూ ప్రసంగించారు.

సభానంతరం శ్రీ నటరాజ రామకృష్ణ శిష్యురాలు కుమారి పి స్వర్ణలత భరతనాట్యం, కూచిపూడి నాట్యరీతులలో మనోజ్ఞమైన నృత్యప్రదర్శన యిచ్చింది.

రేడియో

గురువారం జనవరి 25

శక 1889 - మాఘ 4

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6.00 వందేమాతరం. శుభోదయం ప్రసారవిశేషాలు: 6.10 భక్తిరంజని. 6.40 ఆం. వా: 6.45 సూక్తి ముక్తావళి: 6.50 బజారు ధరలు: 6.55 విరామసంగీతం: 7.00 తె. వా: 7.15 వి. బి. కనకదుర్గ - గాత్రం: 7.30 సంగీత శిక్షణ - సీనియుల్లు: 7.45 జవహర్ వాణి. 8.00 ఆం. వా: 8.15 హిం: వా: 8.30 ప్రసార సమాప్తి.

11.45 మాధ్యమిక పాఠశాలలకు: 12.05 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికుల కార్యక్రమము: 1.00 వి. బి. కనకదుర్గ - గాత్రం 1.30 ఆం. వా: 1.40 హిం. వా: 1.50 తె. వా: 2.00 వాతావరణ సూచన ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.55 స్థానిక ప్రకటనలు: 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 గ్రామలక్ష్మి - ఇంటి పరిశుభ్రత. పరిచయం: 6.30 చిత్ర తరంగిణి - ఫిల్మ్ సంగీతము: 7.00 తె. వా: 7.15 పంట పొలాలు: 7.45 రాగం, తానం, పల్లవి: 8.30 'రిపబ్లిక్ డే' - రాష్ట్రపతి సందేశం: 8.40 గానసుధ: 9.00 ఆం. వా: 9.15 ఢిల్లీ నుండి రిలే: 9.30 హైదరాబాద్ రిలే: 10.30 ఆం. వా: 10.35 జనగణమన ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (ఎ)

405.4 మీ. (740 కిలోసై.)

ఉదయం: 6.30 వందేమాతరం: మంగళధ్వని - కార్యక్రమవివరణ: 6.40 ఆం. వా: 6.45 భక్తిరంజని: 7.00 తె. వా: 7.15 వి. రిలే: 7.30 వి. రిలే: 7.45 సూక్తిముక్తావళి: 7.50 బజారుధరలు: 8.00 ఆం. వా: 8.15 హిం. వా: 8.30 వాతావరణ సూచన - ప్రసార సమాప్తి.

11.45 వి. రిలే: 12.05 సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికుల కార్యక్రమము 1.00 కె. కాంత - గాత్రం: 1.30 ఆం. వా: 1.40 చిత్రగీతాలు: 1.50 తె. వా: 2.00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.55 స్థానిక ప్రకటనలు. 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 ప్రాం. వా. ఉర్దూ: (హైదరాబాద్ - కడపలకు మాత్రమే): 6.25 ముఖ్య ప్రకటనలు: 6.30 బాలవిహార్: 7.00 తె. వా: 7.15 తెలుగు పాట: 7.30 చిత్రగీతాలు: 7.45 వి. రిలే 8.30 'రిపబ్లిక్ డే' - రాష్ట్రపతి సందేశం: 8.40 లలిత సంగీతం - బృందగానం: మునిశి, రత్నం, మల్లిక్: ఘంటసాల, ప్రదేహ, 9.00 ఆం. వా: 9.15 ఢిల్లీనుండి రిలే: 9.30 జాతీయ కవిగోష్ఠి: 11.00 ఆం: వా. 11.05 హిం. వా: 11.10 వాతావరణ సూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

కడప

333.3 మీ. (900 కిలోసై)

పొ 5.55 నుండి రాత్రి 10.40 వరకు

ఆదివారములు మాత్రం

పొ 5.55 నుండి రా॥ 11.10 వరకు

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలోసై)

పొ 5.55 నుండి రా॥ 10.40 వరకు

హైదరాబాద్ - (బి)

283 మీ 1060 కిలోసై.

మధ్యాహ్నం 2.00 శంకర్‌రావు వీణా హరీకర్ - వేణువు 2.10 ఉ. వా: 2.30 ప్రాథమిక పాఠశాలలకు (ఉర్దూ) 2.50 సుగం సంగీత్: 3.00 ప్రసార సమాప్తి.

రాత్రి 8.00 హిందీ ప్రసంగం: 8.15 చిత్రపట్ సే: 8.45 శాస్త్రీయ సంగీత్: 9.00 ముజిక్, గీత్: 9.15 ఉ. వా. 9.30 ఉర్దూలో కార్యక్రమము. 11.00 జన గణ మన. ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

411.0 మీ. 1420 కిలోసై.

ఉదయం: 6.27 వందేమాతరం, మంగళ 7.00 తె. వా: 7.15 సంగీత మంజరి - పన్నిరుతిరుమురై పాడల్‌గళ్: 7.30 విద్వాన్ సుబ్రహ్మణ్యంపిళ్లై - గాత్రం: 8.00 ఆం. వా: 8.15 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 1.00 పాశ్చాత్య సంగీతం: 1.30 ఆం. వా: 1.40 హిం. వా: 1.50 తె. వా: 2.00 ప్రసార సమాప్తి.

(211.3 మీ (1420 కిలోసై)

ప్రా నం 5.30 నుండి 6 05 వరకు

60.93 మీటర్ల పై గూడా

సాయంత్రము 5.30 పాశ్చాత్యసంగీతం. 6.00 ఆం. వా: 6.05 ప్రాంతీయ తెయిదిగళ్: 6.30 మహిళా మండలి. స్త్రీల కార్యక్రమం: 7.00 తె. వా: 7.15 అంజలి: 7.30 చిత్రగానం: 8.00 వి. సరోజ. సి. లలిత - గాత్రం: 9.00 ఆం. వా: 9.15 ఢిల్లీ నుండి రిలే 9.30 ఈమని శంకరశాస్త్రి - వీణ: 10.30 ఆం. వా: 10.35 వాతావరణ సూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

దేశ్‌ముఖ్ దంపతులు శ్రీశైలం సందర్శన

శ్రీశైలం జనవరి 20

దేశముఖ్ దంపతులు శ్రీశైలం ప్రాజెక్టు విచ్చేసిన సందర్భంలో శ్రీశైలం ప్రాజెక్టు సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన స్థానిక హైస్కూలులో బహిరంగసభ జరిగింది.

సాంస్కృతిక సమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలను దేశ్ ముఖ్ దంపతులు ప్రశంసించారు.

సాగర్ కుడికాల్వ 15వ బ్లాకును కరవు పనిగా చేపట్టాలి!

మార్కాపురం కమ్యూనిస్టు సమితి అభ్యర్థన

మార్కాపురం, జనవరి 22

నాగార్జున సాగర్ కుడికాల్వ 15 వ బ్లాకు పనిని కరువు పనిగా చేపట్టి - కర్నూలుజిల్లా మార్కాపురం తాలూకాలోని, వ్యవసాయ కార్మికులకు, పేదరైతులకు పనులు కల్పించాలని, కాల్వపని పూర్తిచేయడం ద్వారా - శాశ్వతంగా కరవు నివారణ చేసినట్లవుతుందని - మార్కాపురం తాలూకా కమ్యూనిస్టు సమితి ఒక ప్రకటన చేసింది

నాగార్జున సాగర్ ప్రాజెక్టు భారతదేశంలో చాలా ప్రధానమైన పెద్ద ప్రాజెక్టు. కొన్ని లక్షల ఎకరాలకు సాగును తీసుకువచ్చి భారత దేశపు నేటి ఆహార కొరతను తీర్చగలదు. ఎల్లప్పుడు వర్షాభావమైన ఆహారపంట తరచు క్షామమునకు గురిఅయ్యే మెట్ట తాలూకాలకు కామధేనువులాంటిది. ఇంత ప్రాధాన్యతగల ప్రాజెక్టు పనికి డబ్బు లేదనే సాకుతో పనిని సాగనీయక ప్రభుత్వం కాలయాపన చేయడము విడ్డూరంగా వుంది. ఒకరికి చేసినపుడల్లా భిక్షం పెట్టినట్లు కోటి. అరకోటి యివ్వడం కేంద్రప్రభుత్వానికి పరిపాటి అయిపోయింది. ఇంత జాతీయ ప్రాధాన్యతగల ప్రాజెక్టును కేంద్రమే స్వయంగా చేపట్టవలసిన బాధ్యత నుండితప్పుకోవడమేకాక, అప్పుకూడ యివ్వ నిరాకరించుచున్నది. ఈ బాపతి నడక వలన ఎంతో డబ్బు వృథా అయిపోయి నానాటికీ ప్రాజెక్టుమీద వ్యయం పెరుగుతోంది. కొద్దిపాటి పనికికూడ స్టాఫ్ వగైరాల మీద హెచ్చించేవ్యయం అలాగే వుంటుంది. అలా కాకుండా నాగార్జున సాగర్ పూర్తయితే మార్కాపురం లాంటి తాలూకాల్లో కరవు యేర్పడదు.

ఎల్లప్పుడు కరువుకుగురిఅయ్యే రాయలసీమలో మార్కాపురంతాలూకా మొదటిది. వర్షపాతం చాలాతక్కువ. మేజరుజలాధారాలులేవు. ఉన్నచిన్నచిన్న చెరువులు ప్రాజెక్టుక్రిందవనీ రిపేరులేక అలాగేవుండిపోతున్నాయి. అలాంటితాలూకాలో దాదాపు 28 వేలఎకరములు సాగుకుతెచ్చే వీలు సాగర్ కుడికాల్వవలన మాత్రమే.

ఈ సంవత్సరము వర్షాభావము వలన అన్ని పైరు పూర్తిగాపోయినవి. మోటలు ఆధారంతోవుండే రాగికూడా యీ సంవత్సరము పేనుబంక తెగులుతో పూర్తిగాదెబ్బ తిన్నది. అందువలన యీ తాలూకాలో చాలాభాగము వలసలువెళ్ళారు. మిగిలినవారు ఎటూతోచక, చేయటానికిపనులులేక, కొనటానికి గింజలులేక, పశువులకు మేతలేక నానాయాతనలుపడుచున్నారు. ఈతాలూకాను కరువు ప్రాంతంగా ప్రకటించికూడ నెలకు పైబడ్డది. ఇంతవరకు కరువు పనులు కల్పించి ప్రజలను ఆదుకొన వలెననే ఆలోచనే యీ ప్రభుత్వానికి కలిగినట్లులేదు. కాబట్టి కరువుపనుల క్రింద సాగర్ కుడి కాల్వ 15వ బ్లాకు పనిని వెంటనే చేపట్టాలని, తద్వారా యిక్కడి ప్రజానీకానికి పని కల్పించాలని కోరుచున్నాము. ప్రభుత్వం కరువు పనులక్రింద 15 వ బ్లాకు పనిని వెంటనే చేయించకపోయిన ప్రజలందరు ఐక్యంగా పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని పిలుపు చేస్తున్నాము.

సింగారం గ్రామ అధికారులకు ఆశాభంగం

డబ్బు చేసుకునే యత్నానికి విఘాతం

వరంగల్ జనవరి 20

వరంగల్ జిల్లా వరంగల్ తాలూకా సింగారం గ్రామంలో ఈ నెల 12 వ తేదీన స్థానిక పటేల్, పట్వారి గారు ఆ పర్ పంచ్‌లు హమ్మా గిర్దావర్, ఇద్దరు పోలీసుల సాయంతో బంజరాయి నాగుదార్ల నుండి డబ్బులు సంపాదించే ఎత్తువేశారు.

బంజరాయిలోని చెట్లు కొట్టి సాగుచేసే పైలుపాత్తి తప్పదని నాగుదార్లందరిని ఒకచోట గుంపుచేసి మాకీ బేరం న్యాయం కొరకు, లంచంఇవ్వాలనిబెదిరించారు.

వెంటనే గ్రామ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ డి. లక్ష్మీనర్సింహారెడ్డి జోక్యం చేసుకొని వారి ఆటలు కట్టించారు.

ఇదే బంజరాయిలోని తుమ్మచెట్లు గ్రామ అవసరాలకు ఎవరైనా అడిగితే ఈ నాయక మహాశయులు తమకు కొన్నిచెట్లు కొట్టి పెట్టాలని డిమాండ్ చేస్తారు.

పేదరైతులు గత వర్షాకాలంలో ఇదే బంజరాయిలో వేసిన పెసర చేలను గ్రామ అధికారులు కుమ్మక్కై మేపించారు.

బంజరు నాగుదార్లు ఐక్యంగా గ్రామాధికారుల దుష్ట చర్యలను ప్రతిఘటించి జిల్లాలోని బంజరు నాగుదార్లకు ఆదర్శప్రాయులుగా ఉండాలని వరంగల్ తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి మహబూబ్ గ్రామ బంజరాయి కాస్తుదార్లను సమావేశపరిచి తెలియజేశారు.

లంచము తీసుకున్న నేరానికి తొలగింపు

మోత్కూరు పంచాయతీ కారోబారు

మోత్కూరు, జనవరి 19

నల్గొండజిల్లా రామన్నపేట తాలూకా మోత్కూరు గ్రామ పంచాయతీ కారోబార్ శ్రీ కొండం వెంకటాపును పింఛనుదారుల నుండి రు 30 లంచం తీసుకున్నందుకుగాను ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన జరిపి అతని పనినుండి తొలగించారు.

ఈ సమీకరణ స్థానిక ఆదర్శ యువక మండలి ఆధ్వర్యాన జరిగినది. వెంకటాపు పుచ్చుకున్న రు. 30 గ్రామ పంచాయతీ అధ్యక్షులు, సభ్యుల సమక్షంలో తిరిగి హామ్య దాతలకు ఇప్పించారు.

రాచకొండ "నిజం" నాటకంపై చర్చ

సికింద్రాబాదు, జనవరి 20

ఆంధ్రప్రదేశ్ సమైక్య విద్యాశాఖ, ఆంధ్ర విశ్వసాహితి ఆధ్వర్యమున ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ హాలులో ప్రముఖ నాటక రచయిత శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచించిన "నిజం" అను నాటకము పై చర్చావేదిక ఏర్పాటు చేయబడినది. శ్రీ దంటు భాస్కరరావు సమావేశమునకు అధ్యక్షత వహించారు. అతి త్వరగా మారుతూన్న సంఘము యొక్క జ్ఞానాభివృద్ధికి, వినోదమునకు సాంస్కృతిక కార్యకలాపాలు చాల అవసరమని శ్రీ భాస్కరరావు చెప్పారు. విశ్వసాహితి సంస్థ తెలుగు సాహిత్యమునకు చేయుచున్న సేవను వారు ప్రశంసించారు. నాట్యవిహార్ యొక్క డైరెక్టరు శ్రీ ఎ. ఆర్. కృష్ణ మాట్లాడుతూ, సత్యము నాధారముగా చేసుకొని వ్రాయబడిన సత్యహరిశ్చంద్ర నాటకం తరువాత "నిజం" అనే యీ నాటకంలో క్రొత్త విలువలు ఉన్నాయి అన్నారు. సత్యాన్వేషణయే యీ నాటకం యొక్క లక్ష్యమని అయితే మొత్తం నాటకంలో ఏదో మంచితనంతో కూడినపాత్ర అని చెప్పేది లేదని అన్నారు.

ఈమధ్య వ్రాయబడిన నాటకములలో ఇది 'ఉత్తమమైన నాటకం' అని శ్రీ కృష్ణ అన్నారు.

శ్రీనండూరి విఠల్ మాట్లాడుతూ నాటకంలో చివర భీకరత్వం ఉందని, కొంత మానసిక తత్వ సంక్లిష్టతలున్నాయన్నారు. శ్రీ ముదిగొండ వీరభద్రశాస్త్రి మాట్లాడుతూ నాటకములోని పాత్రల వైవిధ్యం పోషణా ప్రశంసనీయమన్నారు.

విశ్వసాహితి అధ్యక్షులు శ్రీ పోతుకూచి సాంబశివరావు వక్తలకు స్వాగతము చెప్పి వందన సమర్పణ చేశారు. వక్తల ఆమోదముతో వచ్చేనెల చర్చనీయాంశము "దంతం కథలు" అని నిర్ణయించారు.

జీతాలకై టీచర్ల అభ్యర్థన

వినుకొండ జనవరి 20

గుంటూరుజిల్లా, వినుకొండ తాలూకా ఈపూరు బ్లాకులో దాదాపు 3 నెలలనుంచి ఉపాధ్యాయులు జీతాలు ముట్టక నానాయాతనలు పడుతున్నారు. అదేవిధంగా, వినుకొండ బ్లాకులో ఉపాధ్యాయులకు జీతాలు ఒక నెల బకాయి పడివుంది.

బ్లాక్ ఆఫీసువారేమో బడ్జెటు శాంక్షన్ కాలేదని అంటున్నారు. కానీ రాష్ట్ర పంచాయత్‌రాజ్ శాఖ యీ విషయంలో జోక్యం కల్గించుకొని వినుకొండ, ఈపూరు బ్లాకుల్లో ఉపాధ్యాయులకు జీతాలు అందునట్లు తగు చర్య తీసుకోవాల్సినదిగా ఉపాధ్యాయులు కోరుతున్నారు.

మొగల్తూరు సమితి టీచర్ల అభ్యర్థన

నరసాపురం, జనవరి 22

పశ్చిమ గోదావరిజిల్లా కలెక్టర్ యీ మాసం 19 వ తారీఖున నరసాపురం వచ్చిన సందర్భములో మొగల్తూరు పంచాయతి సమితి ఉపాధ్యాయ సంఘాధ్యక్షులు శ్రీ అల్లూరి రామారావు, కార్యదర్శి శ్రీ యస్. ఆర్. పోలిశెట్టి తదితరులు కలుసుకొని నవంబరు, డిసెంబరు మాసాలకు జీతాలు బట్వాడా కాకపోవుట గురించివివరంగా జిల్లా కలెక్టర్‌కు నివేదించి యీ విషయంలో తగు చర్యతీసుకో వలసిందిగా కోరినారు.

కైకలూరు సమితి అభివృద్ధి ప్రణాళిక

కైకలూరు, జనవరి 20

కృష్ణాజిల్లా కైకలూరు పంచాయతీ సమితి అత్యవసర సమావేశం జిల్లా డెవలప్‌మెంటు బోర్డు ఆదేశానుసారం యీ మాసం 17 వ తారీఖున సమావేశమైంది. సమితి అధ్యక్షులు శ్రీ నంబూరి వెంకట నరసింహరాజు అధ్యక్షత వహించారు. సమావేశమునకు సమితి సభ్యులతో పాటు వివిధ సహకార సంస్థల కార్యకర్తలు, ప్రముఖ రైతులు ఆహ్వానించబడ్డారు. జిల్లా డెవలప్‌మెంటుబోర్డు ఛైర్మన్ అయిన జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్ ఛైర్మన్ పి. కోటేశ్వరరావు తదితర జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొని కైకలూరు సమితిలో స్టేట్‌డెవలప్‌మెంటుబోర్డు సిఫారసుల అవసరానికనుగుణంగా అమలుపరచుటకు రూపొందించబడిన ప్రణాళికను చర్చించారు.

మార్కాపురం తాలూకాలో శిస్తు బకాయి వసూలు ఆపాలి!

శాసనసభ్యుడు శ్రీ పూలసుబ్బయ్య ప్రకటన

మార్కాపురం, జనవరి 22

కర్నూలు జిల్లా, మార్కాపురం తాలూకాలోని కరువు పరిస్థితులను పరిశీలించుటకు, మార్కాపురం రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు, తాలూకా తహసిల్దార్ల వెంబడి, కమ్యూనిస్టు పార్టీ శాసన సభ్యుడు శ్రీ పూల సుబ్బయ్య పర్యటించారు. తన పర్యటన తర్వాత శ్రీ సుబ్బయ్య ఒక ప్రకటన చేశారు.

"మార్కాపురం రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు, తహసిల్దారు వెంబడి నేను - తాలూకాలో పర్యటించాను. తాలూకాలోని కరువు పరిస్థితులు చూచిన తర్వాత - కరువు ఎంత భయంకరంగా వుందో అందరికీ అర్థమైంది.

గ్రామగ్రామాన చౌకడిపోలు ప్రారంభించాలి. తాలూకా మొత్తం మీద పనులు లేకుండా చేతిలో పయాపైసా లేకుండా అలమటిస్తున్న వ్యవసాయకూలీలను, పేద రైతాంగాన్ని ఆదుకొనే నిమిత్తం తక్షణం కరువు పనులు ప్రారంభించాలని, శిస్తు రెమిషన్ యివ్వాలని, పన్ను బకాయి వసూలు చేయడం వచ్చే సంవత్సరానికి వాయిదా వేయాలని. ముంజాపు వున్న మరారిపల్లె. తీగలేరు. బొమ్మలాపురం, పనులు వెంటనే ప్రారంభించాలని, ప్రధానంగా నాగార్జున సాగర్ కుడి కాల్వ పనిని కరువు పనుల క్రింద చేపట్టాలనీ - నేను అధికారులను కోరినాను.

ఒక నెల రోజుల లోపు కరువు పనులు ప్రారంభిస్తామని తాలూకా లో నెలకు రెండు వేల బస్తాల బియ్యం పంపిణీ చేస్తామని ఈపాటికే పుల్లరి రద్దుచేశామని మంజూరు అయివున్న మైనర్ యిర్రిగేషన్ పనులు డబ్బువున్న మేరకు పూర్తిచేస్తామని రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు వాగ్దానం చేశారు.

అయితే శిస్తురెమిషన్ యిమ్మటకు అంగీకరించినా బకాయీలు వసూలు మాత్రం కొనసాగవలసిందేనని పట్టుబట్టారు. ఇది చాలా శోచనీయం. వ్యవసాయ కూలీలు, రైతాంగం తినేందుకు తిండికి లేకుండా, పూట గడవడం గగనంగావుండే బకాయీలు వసూలు పేరుతో రెవిన్యూ అధికారులు తమ దాడి ప్రారంభించడం నిండా అన్యాయం.

కాన రాష్ట్ర ప్రభుత్వం యీ విషయంలో జోక్యం పెట్టుకొని, పరిస్థితులు పూర్తిగా చేతులు దాటిపోకముందే ప్రజా సంఘాలు ఆందోళన చేస్తున్నట్లు తాలూకా ప్రజలను ఆదుకోవాల్సినదిగా కోరుతున్నాను. ప్రధానంగా నాగార్జునసాగర్ కుడి కాల్వ పని కరువు పనుల క్రింద చేపట్టాలని కోరుతున్నాను.

బొంబాయిలో శ్రీ ధారా నాట్యావధానం

బొంబాయి జనవరి 14

బొంబాయిలోఆంధ్రులసంక్రాంతిసాంస్కృతిక కార్యక్రమాలను పురస్కరించుకొని జనవరి 14వ తేదీన స్థానిక ఆంధ్ర మహాసభ ప్రాంగణంలో శ్రీ ధారా రామనాథశాస్త్రి గారి నాట్యావధాన కార్యక్రమం జరిగినది.

ఆంధ్రమహాసభ అధ్యక్షులు శ్రీ పి. ఎన్. మూర్తి వృద్ధులకు, ప్రేక్షకులకు స్వాగతం చెప్పారు. తరువాత ఫిలిమ్స్ డివిజన్ వ్యాఖ్యాత శ్రీ నారప్పన్ కళాకారులకు పరిచయం చేశారు.

శ్రీ శాస్త్రిగారు మొదటిసారి బొంబాయి నగరానికి వచ్చినప్పుడు పండిత నెహ్రూ దివంగతులు కావడంవల్ల అప్పటి కార్యక్రమం వాయిదా పడ్డప్పుడు తమ ఎనస్థితిని ప్రదర్శించవమని శ్రీ వ్యాదేవు పతంజలి అడిగిన సన్నివేశంతో కార్యక్రమం ప్రారంభమైనది.

ప్రముఖ సినీనటుడు జయరాజ్ పెండ్లి చేసి ఒక్క గానొక్క కుమార్తెను అత్తవారింటికి పంపేటప్పుడు గృహానుభవించే మానసికావేదనను ప్రదర్శించమని కోరారు. ఈ సన్నివేశంలో శ్రీ శాస్త్రి ఐశ్వర్యగణికి చెందిన ఒక మురళితండ్రి మనస్తత్వాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను కంటనీరు తెప్పించారు.

శ్రీ శాస్త్రి తన సోదరులు శ్రీ రాధాకృష్ణమూర్తి సహాయంతో ద్రోణుడు - ఏకలవ్య, శాన్‌వేన్ - బీటర్స్ రాజకీయవేత్త, డాన్సర్ శివరాజమూ - శ్రీకృష్ణుడు మొదలైన సన్నివేశాలను లాఘవంతో ప్రదర్శించి ప్రేక్షకుల మనసులను రంజింప చేశారు.

ప్రసిద్ధ సినీనటులు శ్రీమున్ మోహన్ కృష్ణ, ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీ మనోహర్ కొత్వాల్, సినీ నర్తకి కుమారి జీవనకళ సూచించిన సన్నివేశాలను శ్రీ శాస్త్రి ప్రదర్శించారు. ఎంకోసభ కార్యదర్శి పిల్లలమర్రి కృష్ణశర్మ వందన సమర్పణ గావించారు. శ్రీ ధారా సోదరులకు కానుకలు అందజేయబడినవి.

కార్యాచరణను తీవ్రతరంచేయుటకు తప్పదు

కళాశాలల ఉపాధ్యాయ సంఘాల సంయుక్త ప్రకటన

హైదరాబాదు జనవరి 21

కళాశాలల అధ్యాపకుల జీతభత్యం పెంపకం విషయంలో అన్యాయం జరుగుతున్నందున వారిలో నిరుత్సాహం పడుతోందని అనుబంధ. ప్రభుత్వ కళాశాలల ఉపాధ్యాయుల తరఫున ఒక రాయబార వర్గం నిన్న నిక్కడ ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిని కలుసుకొని తెలియజేశారు.

ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ వి రత్నయ్య, ప్రభుత్వ కళాశాలల, గెజిటెడ్ అధ్యాపకుల సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ డి సూర్యప్రకాశరావు, అనుబంధ కళాశాల ఉపాధ్యాయ సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ ఎం. జె. మాణిక్యరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆనందరావులు ఈ క్రింది సంయుక్త ప్రకటన చేశారు

కళాశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అసంతృప్తికరంగా వుండనీ ఉపాధ్యాయులు తమ కోర్కెల సాధనకు తమ పోరాటాన్ని తీవ్రతరం చేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదని రాయబార వర్గం అభిప్రాయపడినట్లు తెలియజేశారు

ఉపాధ్యాయుల కోర్కెలను వెంటనే ప్రభుత్వంచేత అంగీకరింపచెయ్యడానికి భవిష్యత్ కార్యాచరణపై త్వరలో విజయవాడలో జరగనున్న ప్రతినిధుల సమావేశం నిర్ణయం జరుపుతుందని తెలియజేశారు.

వ్యవసాయకార్మికులపై భూస్వాముల దాడులు

నెల్లూరుజిల్లా దామర మడుగులో సంఘర్షణ: పలువురికి గాయాలు

నెల్లూరు, జనవరి 20

నెల్లూరుజిల్లా దామరమడుగులో కూలీ రేట్లను పెంచాలని ప్రచారంజరుగుతూ పెరిగిన ధరలకనుగుణ్యంగా కనీసకూలి రు. 2.50 (రెండున్నర) సాధించుకొనుటకు ఆందోళన సాగించబడినది. వ్యవసాయకూలి పుష్యమాస్ని నిర్విఘ్నంచేయుటకే తద్భిన్నంగా పెత్తుకొన్న గ్రామభూస్వాములు ఏ పరిస్థితులలోనూ. రు. 2.00 (రెండురూపాయలు) మించిఇవ్వమనిచెప్పి, సంఘబలముతో పరాయి గ్రామకూలీలను తెచ్చుకొనుట ప్రారంభించినారు. పైపెచ్చు భూస్వాములు 17 వ తేదీ షేక్ దస్తగిర్ సాహెబ్, అతనికుమారుడు రంగు సాహెబు గార్లను విచక్షణారహితంగా కొట్టడం జరిగింది. దీనితో ఉభయ పక్షాల ఉద్రిక్తతలు పెరిగినాయి 19 తేదీ ఉభయుల మధ్య కొట్లాటలు ప్రారంభమై తీవ్ర స్థాయికి పోయినవి. ఆరోజు జరిగిన ఘటనలలో వ్యవసాయ కార్మికుల పక్షాన గ్రామ మార్క్సిస్టునాయకుడు మోడెంపలరఘరామిరెడ్డి, వ్యవసాయ కార్మికుడు ఎరవల రమణయ్య. భూస్వాముల పక్షాన కోటంరెడ్డి వెంకరెడ్డి పాలవర్త కొండారామిరెడ్డి గార్లకు తీవ్ర గాయాలు తగిలి నెల్లూరు గవర్నమెంటు ఆసుపత్రిలో చేర్చబడి వున్నారు. దెబ్బలకు గురియైన వ్యవసాయ కార్మిక స్త్రీలు కొందరు గూడ ఆసుపత్రిలో వున్నారు.

పోలీసులు గ్రామంలో వుండికూడ తీవ్ర సంఘర్షణలు జరుగుతుంటే శాంతిభద్రతలు కాపాడలేక పోయారు.

గత సంవత్సరం అక్టోబరులో నాయుడుపేటలో కూలీరేట్లపై వ్యవసాయ కార్మికులు సమ్మె జరపడం, భూస్వాములు ఆనాడు మొండిగా వ్యవసాయ కార్మికుల కనీస కోర్కెలను నిరాకరించడం, అప్పటి నుండి యీ వైరుధ్యాలలాగే వుండటం విశాలాంధ్ర పాఠకులకు విదితమే. (వి. వి.)

కోడూరులో స్కూళ్ళ భవనాల కొరత

పూర్వ విద్యార్థిసంఘ ఆందోళన

కోడూరు. జనవరి 20

కృష్ణాజిల్లా దివితాలూకా కోడూరు పూర్వ విద్యార్థిసంఘ ప్రథమ వార్షికోత్సవం యీ మాసం 15 వ తేదీ స్థానిక ప్రాథమిక పాఠశాలలో డా॥ యస్. కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది

సంఘ కార్యదర్శి శ్రీ కె. శ్రీరామమూర్తి వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. రంగస్థల నటుడు. శ్రీ హరిబాబుకు సన్మానం చేశారు. మరునాడు జరిగిన - సంఘ సర్వసభ్య సమావేశంలో - సంఘం పటిష్టంగా రూపొందించుటకు కొన్ని నిర్ణయాలు చేశారు.

10 వేల జనాభాగల కోడూరులో ప్రాథమిక పాఠశాలకు స్వంతభవనం లేదు. హైస్కూలు భవనం కూడా జీర్ణావస్థలో వుందని కనుక నదరు స్కూళ్ళ భవనముల నిర్మాణాన్ని చేపట్టవలసినదిగా జిల్లాపరిషత్ వారిని కోరుతూ తీర్మానం చేశారు.

రంపాడు రోడ్డును మరమ్మతు చేయాలి!

రెడ్డి కొట్టాల శాఖ తీర్మానం

పోరుమామిళ్ళ, జనవరి 22

కడపజిల్లా, బద్వేలు తాలూకా రెడ్డి కొట్టాల గ్రామశాఖ సమావేశం యీ మాసం 15 వ తారీకున జరిగింది. తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ అబ్దుల్ ఖాదర్ సమావేశంలో పాల్గొని రాజకీయ రిపోర్టు యిచ్చారు.

గ్రామంలో పార్టీ నిధి ధాన్య రూపంలో వసూలు చేయాలని, పార్టీ దండును ప్రతి నెలలను పంపాలని తీర్మానించారు.

శిథిలావస్థలోనున్న రంపాడు రోడ్డును వెంటనే మరమ్మత్తు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానం చేశారు.

పంచదారకు సూర్యాపేట ప్రజల దురవస్థ

ప్రజల గోడు పట్టించుకోని తహసిల్‌దారు నిర్లక్ష్యవైఖరి

సూర్యాపేట. జనవరి 20

నల్లగొండజిల్లా సూర్యాపేట పట్టణంలో పంచదారసప్లయి చాలా ఘోరంగా తయారయింది. పంచదార కూపనులున్నవారికి కూడా సక్రమంగా దొరకడంలేదు. ఒక్కరోజు ఆగి వెళ్ళినా పంచదార స్టాకు లేదని డీలర్లు చెబుతున్నారు.

పట్టణంలో ఎక్కువమందికి కూపనులు లేవు. పాతవారికికూడా తిరిగి కూపనులు యివ్వటంలేదు ప్రతిరోజు వందలాదిగా ప్రజలు పంచదార కూపన్ల కొరకు తహసిల్‌దారు ఆఫీసు చుట్టేస్తున్నారు. ఈ విధంగా అసంఖ్యాకంగా వచ్చే జనాన్ని అదుపులో పెట్టేందుకు - తహసిల్‌దారు పోలీసులను కూడా పిలిపించాల్సివచ్చిందంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా తయారైందో అర్థం కాగలదు.

ఈ విషయమై - పక్షం రోజుల క్రితం జిల్లా కమ్యూనిస్టుపార్టీ సహాయ కార్యదర్శి శ్రీ ధర్మభిక్షం. తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ జి. పిచ్చిరెడ్డి పట్టణ కమిటీ కార్యదర్శి శ్రీ గాల వెంకటయ్య, తాలూకా యువజన సంఘ కార్యదర్శి శ్రీ అనంతుల బుచ్చిరాములు తదితరులు తహసిల్‌దార్ను కలుసుకొని సంప్రదింపులు జరిపారు. బ్లాక్ మార్కెట్టుకు వెళ్ళుతున్న చక్కెరను ఆపువేయవల్సినదిగాను పరిపడు సంత చక్కెర కోటా తెప్పించవలసినదిగా కోరినారు.

కాని పక్షం రోజులు గడుస్తున్నా తహసిల్‌దారు ఏ చర్య తీసుకోకుండా - పైగా తహసిల్‌దారు సెలవు పెట్టి హెడ్‌క్వార్టర్సులో వుండకుండా వెళ్ళారు.

యీ క్లిష్ట పరిస్థితిని జిల్లా అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవలసినదిగా పై ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. (వి.వి.)

రాజమండ్రిలో జూదరులకు జరిమానా

రాజమండ్రి. జనవరి 22

రాజమండ్రి ఫస్టుక్లాసుబెంచి మేజిస్ట్రేట్ శ్రీ యస్. సూర్యప్రకాశరావు 37 మంది జూదరులకు రు. 5/ నుండి రు. 15/ వరకు జరిమానా విధించారు.

రాజమండ్రిపట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ వి. రామచంద్రరావు యీ మాసం 17 వ తారీఖు జరిపినదాడులలో వీరిపై కేసుపెట్టటం జరిగింది. వీరివద్ద రు. 284.20 స్వాధీనం చేసుకోవడమైనది.

బెస్తవారపేట సమితి యన్. జీ. వో. సమావేశం

బెస్తవారపేట. జనవరి 20

కర్నూలుజిల్లా, బెస్తవారపేట పంచాయతీ సమితి నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం యీ నెల 16 వ తారీఖు శ్రీ యం. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. మార్కాపురం శాసన సభ్యుడు శ్రీ వెంగయ్య ప్రధాన అతిథిగా వచ్చారు.

ఈనెల 24వ తారీఖున రాష్ట్రవ్యాపితంగా జరగనున్న సమ్మెలో తమవంతు బాధ్యత వహించుటకు తీర్మానం చేయబడింది.

హిందూ - ముస్లిమ్‌ల వైషమ్యాలకు బాధ్యత బ్రిటన్‌దే:

భగత్‌సింగ్ అనుచరుని స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 22

భారతదేశంలోని హిందూ-ముస్లిమ్‌లమధ్య బ్రిటిష్ ప్రభుత్వం అనుమానాలు సృష్టించిన విషయం చారిత్రక సత్యమని. అంతేకాక, పెద్ద మతంలోని అభివృద్ధి నిరోధకులను బ్రిటిష్ ప్రభుత్వం యీ ఘటనలో పనిముట్లుగా ఉపయోగించుకుందని భగత్‌సింగ్ సహచరుడు, సుప్రసిద్ధ దేశభక్తుడు శ్రీ బి. కె. సిన్హా చెప్పారు. స్థానిక ఉర్దూ హాల్లో ఉర్దూ జర్నలిస్టులు ఏర్పాటుచేసిన తాష్కెంట్ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిన్హా నేడు ప్రసంగించారు

భారత, పాకిస్తాన్లమధ్యే కాకుండా, అన్ని జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లోను తాష్కెంటు సూత్రాన్ని పాటించి కట్టుబడివుండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం దేశభక్తులు అగ్రభాగాన నిలిచి పోరాడారని మన స్వాతంత్ర్య పోరాటచరిత్రను విస్తృతంగా వివరిస్తూ తెలియజేశారు.

భారత, పాకిస్తాన్ ప్రజలు విప్లవ యోధుల అడుగుజాడల్లోనడుస్తూ, ఉభయ దేశాలను సోషలిస్టు పంథాలోకి నడుపవలెనని ఉద్బోధించారు.

తాష్కెంటు ప్రకటన వార్షికోత్సవాన్ని లాల్‌బహదూర్ శాస్త్రి దినంగా జరపాలనీ ఆయనకు శాంతి సాధనలో నోబుల్ బహుమతి యివ్వాలనీ శ్రీ తేజ్ ప్రకాశ్ మహాత్ స్వాగతోపన్యాసం యిస్తూ తెలియజేశారు.

ఆయుధాలు. మందుగుండుసామగ్రితో భారత్‌కి చొరబాటుదారులను పంపడానికి బదులు, సుహృద్భావ సంఘాలను పంపించాలని పాకిస్తాన్ ప్రజలకు, ప్రభుత్వానికి సమావేశ అధ్యక్షులు శ్రీ బి. సుందరరావు విజ్ఞప్తి చేశారు.

శాంతికాముకులైన పాకిస్తాన్ మేధావులకు స్వాగతం యిస్తామని ఆయన చెప్పారు.

ప్రముఖులు ఎ. ఎ. మిర్జా, ఎ. కె. జీవన్ ప్రసంగించారు.

సమావేశ కర్త శ్రీ మొహిదీ అబీద్ వందన సమర్పణ చేశారు.

'చీటింగ్' నేరానికి సంవత్సరం శిక్ష

భీమవరం: జనవరి 22

గత నవంబరులో బెంగుళూరులో "చీటింగ్" (మోసం) చేసిన నేరం క్రింద ఒక లాడింగ్‌లో వచ్చిన గోదావరి జిల్లా, భీమవరం పోలీసులు అరెస్టుచేసిన బృందంలో వట్నాల కృష్ణమూర్తికి, భీమవరం ఫస్టుక్లాసు మేజిస్ట్రేట్ విచారించి సంవత్సరం కఠినశిక్ష. రెండువందల రూపాయలు జరిమానా. చెల్లించలేకపోతే అదనంగా రెండు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పుయిచ్చారు

మిగిలిన ఇద్దరిని నిర్దోషులని విడుదల చేయడం జరిగింది.

సమ్మె నోటీసు యిచ్చుటకు గుంటూరు మునిసిపల్ కార్మికుల నిర్ణయం

వాగ్దానం నిల్పుకోనందుకు నిరసనగా

గుంటూరు, జనవరి 22

సంవత్సరమునకు రెండుజతల గుడ్డలు యివ్వాలని 67 జనవరి నుండి నూనె, సబ్బులు, తువాళ్ళు ఇవ్వాలనికోరుతూ మునిసిపల్ అధికారులకు అనేకసార్లు కార్మికులు విజ్ఞప్తులూ, మహజరూ సమర్పించారు కార్మికులు ఎంతో సహనంతో వ్యవహరించినప్పటికీ ఫలితంలేనందున ఈ నెల 18 వ తేదీన ఊరేగింపు బహిరంగసభ జరిపి సమ్మెనోటీసు నిచ్చుటకు నిరాహారదీక్ష ప్రారంభించుటకు యూనియన్ కార్యనిర్వాహకవర్గమునకు అధికారమిస్తూ తీర్మానించారు.

సంక్రాంతి పండుక్కుముందే మున్సిపల్ కార్మికులు రెండు జతల దుస్తులు పొందవలెను, యూనిఫారం స్త్రీలకు జత చీరలు జత జాకెట్లు ఇవ్వాలని కోరుతూ ఛైర్మన్‌కూ మున్సిపల్ కార్యదర్శికి అనేక సార్లు మహజర్లు సమర్పించారు. విజ్ఞప్తులు చేశారు మున్సిపల్ అధికారులుగాని, అధికార పార్టీగాని కార్మికుల విజ్ఞప్తులను లెక్క చేయనందున డిసెంబరు 27 వ తేదీ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా వందలాది మున్సిపల్ కార్మికులు కౌన్సిల్ హాలు వద్దకు వచ్చి ఛైర్మన్‌కు తమన్యాయమైన కోర్కెలను వివరిస్తూవిజ్ఞప్తిచేశారు. అనేక మందికౌన్సిలర్లు కార్మికుల కోర్కెలను బలపరుస్తూ మాట్లాడారు. ఛైర్మన్ శ్రీ చేదోలు హనుమయ్య వైస్ ఛైర్మన్ శ్రీ కన్నెగంటి అంకమ్మరావులు సంక్రాంతిముందే మున్సిపల్ కార్మికులకు దుస్తులు యిచ్చే ఏర్పాట్లు చేస్తామని వాగ్దానం చేశారు.

వాగ్దానం మేరకు పాటించ వలసిన అధికార్లు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌ల వాగ్దానాన్ని గాలికొదిలి జనవరి 14 వ తేదీన స్త్రీ కార్మికులు మాత్రం చీరలు, జాకెట్లు తెచ్చి పంచుటకు సిద్ధమయ్యారు. ఇందులోని మోసాన్ని గ్రహించిన కార్మికులు రంగు గ్యారంటీకొరకు ఉతికి చూడమని కోరారు. ఆ మున్సిపల్ అధికార్లు ఏదో ఇవ్వాలని అనిపించుకొనుటకు పన్నిన ప్రయత్నం చేశారు కానీ, కార్మికులు ఐక్యంగా నిలబడినందున గత్యంతరం లేక 16 వ తేదీన కౌన్సిల్ ప్రతిపక్ష సభ్యుల, కార్మిక నాయకుల సమక్షంలో పరిశీలన జరిపారు. చీరల వెడల్పులు తగినవి. నేతబలికిగావున్నది. నరుకులో ఎక్కువభాగం పాతది. మోసంబయటపడగా కంట్రాక్టరుని పిలిపించి మార్చుమని ఛైర్మన్ సమాధానమిచ్చి. బలవంతాన కార్మికులకిచ్చు ప్రయత్నం విరమించుకున్నారు. ఇంతకు ముందు కార్మికులకు నూనె, సబ్బులు తువాళ్ళు ఇవ్వాలని కౌన్సిల్ తీర్మానంచేసినప్పటికీ అమలు చేయక రెండునెలలు మాత్రం ఇచ్చి ఎగనామం పెట్టారు.

యీ మాసం 18 వ తేదీన అయిదువందల మంది మున్సిపల్, కార్మికులు స్త్రీ పురుషులు కలిసి నాయకత్వం 4 గంటలపు ప్రదర్శనపైన ఊరేగింపుతో స్టేషనురోడ్డ శ్రీ రావు నాగయ్య అధ్యక్షతను బహిరంగ సభ జరిపారు. మున్సిపల్ అధికారుల, లంచగొండితనాన్ని, అధికారపార్టీ కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ కార్మిక నాయకులు శ్రీ క. పి. రి నాగయ్య. కౌన్సిల్ ప్రతిపక్ష నాయకులు శ్రీ కోట వెంకటేశ్వర్లు కార్మిక సంఘ కార్యకర్తలు శ్రీ చిన్నయాని మారుతి వీరరాఘవులు మున్నగువారు మాట్లాడారు.

అనంతరం సమ్మెనోటీసు. నిరాహారదీక్ష ప్రారంభించుటకు నిర్ణయించి. వర్కింగ్ కమిటీకి అధికారమిస్తూ తీర్మానించారు.

కళాకారులకు సన్మానం

విజయపురి. జనవరి 20

స్థానిక కళాసేవకు నాటక సంస్థ నాగార్జున సాగర్ ప్రాజెక్టు డిప్యూటీ చీఫ్ ఎకౌంట్సు ఆఫీసరు శ్రీ పి ఎ శేషన్ అధ్యక్షతన పలు నాటకపోటీలలో విజేతలైన శ్రీ ముత్తులు పి. దాసు. టి బాలకృష్ణదాసు. సి. భాస్కరనాయుడు. వి. రామమూర్తిలను సన్మానించారు

గత ఆరు సంవత్సరములుగా ప్రాజెక్టులో పనిచేస్తున్న ఆ పనుల కళాకారులను రిట్రెంచిమెంటు గురికాకుండా కాపాడవలసినదిగా యీ సమావేశంలో తీర్మానించారు. తదనంతరం స్థానిక నాటక కళాకారులచే "కీర్తిశేషులు" అనునాటకం ప్రదర్శించబడింది.

చీరాలలో హిందీ వ్యతిరేక ప్రదర్శనలు

చీరాల, జనవరి 23

చీరాలలో నిన్న హిందీ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. విద్యార్థులు స్టేషనువద్దకువెళ్ళి మద్రాసు హౌరా ఎక్స్‌ప్రెస్‌ను ఆపివేశారు. ఈ నెల 20 వ కాలేజీ విద్యార్థులపై లాఠీఛార్జి జరిగింది. పోలీసు బందోబస్తు జాస్తిగా వుంది.

చీరాలలో అంటు జాడ్యాలు

పురపాలకసంఘ నిర్లక్ష్యం

గుంటూరు, జనవరి 23

గుంటూరుజిల్లా చీరాలలో అంటుజాడ్యాలు విపరీతంగా ప్రబలాయి. ఫ్లూ, ఆటలమ్మ బాగా వ్యాపించాయి. పురపాలక సంఘం ముందు జాగ్రత్త తీసుకొనివుంటే ఇవి నివారింపబడివుండేవి. కనీసం పెనాయిల్ గూడా చల్లించలేకపోయారు. వెంటనే పురపాలక సంఘంచే తగు చర్యలు తీసుకొనేట్లు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చీరాలలో ఇస్కస్ సమావేశం

చీరాల, జనవరి 23

చీరాలలో నేడు ఇస్కస్ సమావేశం జరిగింది. జాతీయ ఇస్కస్ కార్యవర్గ సభ్యుడు శ్రీ ధన్ ప్రభృతులు ప్రసంగించారు. గుంటూరులో జరిగే జాతీయ మహాసభకు ప్రతినిధులను ఎన్నిక చేయాలని నిర్ణయించారు.

కేరళ హైకోర్టు జడ్జిపై సభాహక్కుల తీర్మానం

హక్కుల కమిటీకి పంపుతూ స్పీకరు రూలింగు

తిరువనంతపురం, జనవరి 22

కేరళ ముఖ్యమంత్రి శ్రీ ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్‌పై విచారణ జరుగుతున్న కోర్టుధిక్కారణ కేసు సందర్భంగా, కేరళ హైకోర్టు జడ్జి శ్రీ పి. టి రామన్‌నాయర్, అడ్వొకేట్ శ్రీ టి. నారాయణన్ నంబియార్ కేరళ శాసన సభ్యుల హక్కులకు భిన్నంగా మాట్లాడినందుకు వచ్చిన హక్కుల తీర్మానాన్ని నేడు కేరళ శాసనసభ సభాహక్కుల కమిటీకి నివేదించింది

నంబూద్రిపాద్‌పై కోర్టుధిక్కారణనేరాన్ని విచారిస్తున్న సందర్భంగా, అడ్వొకేట్ టి. నారాయణన్ శాసనసభ్యులు సాధారణంగా "జీరో" (సున్న) అని వ్యాఖ్యానించగా, ఒక్కొక్కప్పుడు వారు "బిగ్ జీరో" (పెద్ద సున్న) అని న్యాయాధిపతి పి. టి. రామన్‌నాయర్ విమర్శించినట్లు "కేరళ కౌముది" సుప్రసిద్ధ కేరళ వార్తాపత్రిక ప్రకటించింది.

పై ప్రకటన ఆధారంగా ఆర్. ఎస్. పి. సభ్యుడు శ్రీ బేబీజాన్ ఉభయులపైన కేరళ శాసనసభలో సభా హక్కులకు భంగకరంగా ప్రవర్తించారని చెప్పే తీర్మానం ప్రతిపాదించారు.

స్పీకరు వ్యవధి కోరారు.

నేడు స్పీకరు శ్రీ దామోదరపొట్టి దాన్ని సభా హక్కుల కమిటీకి నివేదించాలని రూలింగు యిచ్చారు.

స్పీకరు తన రూలింగును చదవడానికి ముందు అడ్వొకేట్ జనరల్ శ్రీ. పి. సుబ్రహ్మణ్యం పొట్టి శాసనసభలో వున్నారు.

సభా నాయకుడు శ్రీ నంబూద్రిపాద్ సభా హక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

రాజ్యాంగం ప్రకారం శాసనసభ, న్యాయశాఖ ఆయా రంగాల్లో స్వతంత్ర సంస్థలనీ, ఒకరు యింకొకరి నిర్వహణలో జోక్యం చేసుకోరాదని రాజ్యాంగం తెలియజేస్తూందని స్పీకరు చెప్పారు.

రాజ్యాంగం 194 (1) నిబంధన ప్రకారం ప్రతి శాసనసభ్యునికి శాసనసభలో శృంఖలా రహితమైన వాక్స్వాతంత్ర్యం యివ్వబడిందనీ శాసనసభలో వారు ఏ విషయంచెప్పినా వారిపైన ఎట్టిచర్యా తీసుకోరాదనీ అన్నారు.

అయితే రాజ్యాంగ నిబంధన 211 ప్రకారం శాసనసభలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల విధినిర్వహణపై ఎటువంటి చర్చలు జరపరాదని నిబంధనం విధించబడిందని స్పీకరు శ్రీ పొట్టి వివరించారు.

న్యాయస్థానాలు స్వేచ్ఛగా నిర్వహించబడానికి హామీగా ఈ నిబంధనం అవసరమని రాజ్యాంగకర్తలు భావించి వుండవచ్చునని ఆయన అన్నారు

రాజ్యాంగంలోని 210 నిబంధన న్యాయస్థానాలకు ఎట్టి హక్కు యివ్వడంలేదనీ కాని శాసనసభ్యుల వాక్స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తూందనీ అన్నారు.

కేరళ శాసనసభ పైనిబంధనను ఎప్పుడూ ఉల్లంఘించలేదనీ, కాని కేరళ న్యాయమూర్తి ఆ విధంగా శాసనసభ్యుల విమర్శించడం విచారకరమనీ అన్నారు.

శాసన సభనిర్వహణ నిబంధనం 125 ప్రకారం పైఅంశాన్ని సభాహక్కుల కమిటీకి నివేదించాలని తెలియజేశారు.

సింహళంలో మధ్యంతర ఎన్నికలు?

కొలంబో, జనవరి 22

సింహళంలో మధ్యంతర ఎన్నికలు జరిగే సూచనలున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు.

రు 20 లక్షల ఎన్నికల నిధిని వసూలు చేయాలని యునైటెడ్ నేషనల్ పార్టీ నిర్ణయించడంతో యీ ఊహకు మరింత బలం చేకూరింది. ఈ పార్టీ సింహళ ప్రధాని శ్రీ సేనానాయకేకు చెందినది.

1970 మార్చిలో సింహళంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. కాని ప్రధాని సేనానాయకేకు పార్లమెంటులో తగినంత మెజారిటీ లేనందున మధ్యంతర ఎన్నికలు జరపడంద్వారా పార్లమెంటులో మెజారిటీ సంపాదించాలని ఆయన భావిస్తున్నారని, అందువలన మధ్యంతర ఎన్నికలకు అవకాశమున్నదని పరిశీలకులు భావిస్తున్నారు.

1965 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో 157 మంది సభ్యులున్న పార్లమెంటుకు శ్రీ సేనానాయకే పార్టీకి చెందిన వారు 66 గురు మాత్రమే ఎన్నికయ్యారు.

ప్రభుత్వాన్నిఏర్పాటు చేయడానికిమార్క్సిజంపట్లవ్యతిరేకతతో అనుపార్టీల ప్రతినిధులు శ్రీ సేనానాయకేను బలపర్చారు. ఈ పొత్తు సక్రమంగా లేదని తర్వాత ఘటనలు రుజువు చేశాయి.

శ్రీమతి బండారనాయకే పార్టీ శ్రీ లంక ఫ్రీడంపార్టీ, తదితర ప్రతిపక్ష పార్టీలు తమ పార్టీలను ఎన్నికలకు సమాయత్తం చేసుకుంటున్నాయి.

జకార్తాలో సైనిక కాపలా

విద్యార్థి ప్రదర్శనలను అడ్డుకొట్టడానికి

జకార్తా, జనవరి 22

ఇండొనీషియాలో ఆర్థికాభివృద్ధి చర్యలను అనుసరించవలసిందిగా కోరుతూ విద్యార్థులు జరుపుతున్నప్రదర్శనలను విఫలం చెయ్యడానికి నేడు జకార్తాలోని వివిధ కీలక కేంద్రాలలో సైనికులను కాపలావుంచారు.

"బుద్ధిలేని మంత్రులు" "ప్రజలు ఆకలితో మాడిపోతున్నారు" "ధరలు ఎక్కడికి పోయాయి" అని నినాదాలుయిస్తూ కరపత్రాలు పంచిపెడుతూ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో జకార్తాలోని వీధుల్లో ప్రదర్శనలు జరపడంతో, రోడ్లపైన బస్సులు నిలిచిపోవడం, రాకపోకలు ఆగిపోవడం జరిగింది

రెండు సంవత్సరాలక్రితం ఇండొనీషియా మాజీ అధ్యక్షుడు సుకర్నోని పదవీభ్రష్టుని చెయ్యడానికి విద్యార్థులు ఎంత పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిపారో యిప్పుడు కూడా అదే స్థాయిలో ప్రదర్శనలు జరిపినట్లు పరిశీలకులు తెలియజేశారు.

జకార్తా సైనికాధికారి మేజర్ జనరల్ అమీర్ మచ్‌మద్ తన బెటాలియన్ కమాండర్లను సమావేశపరచి, నేడుజరిగిన విద్యార్థి కార్యాచరణపై చర్చించారు.

పంజాబులో

గిల్ ప్రభుత్వ స్వస్తికి ప్రజా ఉద్యమ ద్వితీయ ఘట్టం

గుర్నాంసింగ్ ప్రకటన

ఛండీగర్, జనవరి 22

పంజాబులో కాంగ్రెసును బలపరుస్తున్న చట్ట వ్యతిరేక గిల్ ప్రభుత్వాన్ని కూలద్రోసే ఉద్యమంలో ద్వితీయ ఘట్టంగా అన్ని ప్రజాస్వామిక పద్ధతుల్లోను ప్రజలకు శిక్షణ యివ్వడానికి పంజాబులోని ప్రజల ఐక్య సంఘటన కార్యక్రమాన్ని ప్రారంభించింది.

పంజాబులోని అన్ని జిల్లా, గ్రామీణ కేంద్రాల్లోను ఫిబ్రవరి 24 నుంచి రెండవ దశ కార్యక్రమంగా ప్రజా ప్రదర్శనలు జరపబడతాయని ఐక్యసంఘటన నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ గుర్నాంసింగ్ నేడు ఒక పత్రికా గోష్ఠిలో ప్రకటించారు.

అమెరికాచే 16టన్నుల ఉపగ్రహ ప్రయోగం

ప్రయోగానంతరం రాకెట్ ఇంజన్ చెడిపోయినట్లు వార్త

కేప్ కెన్నడీ జనవరి 22

చంద్రునిపైకి మానవుణ్ణి పంపేందుకు జరిగే సన్నాహాల్లో భాగంగా భూమి చుట్టూ పరిభ్రమించే 16 టన్నుల బరువు గల ఉపగ్రహాన్ని నేడు అమెరికా ప్రయోగించింది.

1.8 మిలియన్ల పౌండ్ల శక్తిగల బోస్టర్ రాకెట్ ఈ నౌకను అంతరిక్షంలోకి తీసుకు పోయింది.

ఇటువంటి ప్రయోగం ఇదివరకు జరగలేదని, అంతరిక్ష పరిశోధకులు అన్నారు.

ఉపగ్రహం ప్రయోగం జరిగిన కొంది సేపటికి రాకెట్ యింజన్ చెడిపోయిందని అధికార్లు తెలిపారు

ఉపగ్రహం ఆస్ట్రేలియా గగనతలంమీద వుండగా ఈ చిక్కు ఏర్పడింది.

వాషింగ్టన్, జనవరి 22

వర్ధమాన దేశాలకు అమెరికా చేస్తున్న సహాయం 1967 వ సంవత్సరంలో 25 కోట్ల డాలర్లు తగ్గిందని అమెరికా వైట్ హౌస్ నివేదిక తెలిపింది.

గత జూన్‌నాటికి వర్ధమానదేశాలకు అమెరికా 100 కోట్లపౌండ్లను సహాయం చేసిందని ఆ నివేదికలో తెలిపింది.

రక్షణ వ్యవహారాల మంత్రివర్గ ఉపసంఘ సమావేశాలకు సైన్యాధిపతుల గైర్ హాజరు

న్యూఢిల్లీ, జనవరి 22

కేంద్ర మంత్రివర్గంలోని రక్షణ వ్యవహారాల ఉపసంఘం, విదేశ వ్యవహారాల ఉపసంఘం సమావేశాలు ఈ రోజు ఢిల్లీలో జరిగాయి.

ఈ సమావేశాలకు ప్రధాని ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు.

ఇటీవల కొంతకాలంగా రక్షణ వ్యవహారాల ఉపసంఘం సమర్థవంతంగా పనిచేయటం లేదని భావించారు. సైనికాధిపతులు ఈ సమావేశాలకు హాజరు కానందున అవి లాంఛన ప్రాయంగా జరిగే సమావేశాలు గానే మిగిలాయి

రక్షణ వ్యవహారాల ఉపసంఘంలో శ్రీమతి ఇందిరాగాంధీ మురారీ దేశాయి, స్వరణ్‌సింగ్, వై. బి చవాన్‌లు సభ్యులు.

విదేశీ వ్యవహారాల ఉపసంఘం, నేడు ప్రధానంగా ఆగ్నేయాసియా పరిస్థితిగురించి, కాంబోడియా సరిహద్దులలో అంతర్జాతీయ కంట్రోల్ కమిషన్‌నుబలపర్చాలనే సిహనౌక్ ప్రతిపాదనను పరిశీలించింది

విదేశాంగశాఖఅభిప్రాయాన్ని మంత్రివర్గం ఉపసంఘం ఈ విషయంలో దృవీకరించింది. 1954 జెనీవా ఒప్పందం దృష్ట్యా అంతర్జాతీయ కంట్రోలు కమిషన్ పనికి కొన్ని అవధులున్నాయని, ఒప్పందం ఉల్లంఘన విషయమై నిర్దిష్ట ఆరోపణలు వుండే వాటిని పరిశీలించటం కంట్రోల్ కమిషన్

బడ్జెట్ విధానంపై మంత్రివర్గంలో అభిప్రాయభేదాలు

పని అని విదేశాంగశాఖ భావిస్తున్నది. కాంబోడియా చేసిన విజ్ఞప్తిలో ఒప్పందం ఉల్లంఘన గురించి నిర్దిష్టంగా ఎటువంటి ఆరోపణా లేదు.

టోక్యోలో ప్రధాని ఇందిరాగాంధీ జరపవలసిన చర్చనీయాంశాల గురించి ఉపసంఘం సంప్రదింపులు జరిపింది. అలాగే కొసిగిన్‌తో జరిపే చర్చలు గురించి ఆలోచించింది.

రేపు మంత్రివర్గ సమావేశం

దేశాన్ని ఎదుర్కొంటున్న అనేక సమస్యల గురించి పరిశీలించటానికి కేంద్ర మంత్రిమండలి సమావేశాలు రేపటినుంచి వరుసగా కొన్ని జరుగుతాయి.

ప్రధానంగా పబ్లిక్ రంగంలోని పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన అంశాలగురించి పరిశీలన జరుగుతుంది.

ఈ ఏడాది ప్రభుత్వం ఆదాయం అంచనాల కంటె రు.100 కోట్లు తక్కువవస్తుందన్న దృష్ట్యా పబ్లిక్ రంగ పరిశ్రమలపై పెట్టే పెట్టుబడులను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్నది.

ఈ విషయమై కేంద్ర మంత్రివర్గం గత కొంది మాసాలలో రెండుసార్లు చర్చలు జరిపింది.

కాంగ్రెస్ ఆమోదించిన దశ సూత్ర పథకం గురించి కూడా ఇదివరలో కొంత చర్చ జరిగింది.

భాషా సమస్య, అస్సాం పునర్వ్యవస్థీకరణ విషయం కూడా చర్చలుజరుగుతాయి

బడ్జెట్‌పై అభిప్రాయభేదాలు

వచ్చే యేడాది బడ్జెట్ విధానం విషయమై మంత్రివర్గంలో అభిప్రాయ భేదాలున్నాయి ఈ ఏడాది పంటలు బాగా వున్న దృష్ట్యా వచ్చే ఏడాది అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే విషయంలో ప్రభుత్వం సాహసంతో వ్యవహరించాలని కొందరు అంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న నిరుద్యోగ నివారణకు ఇదే మార్గమని వాదిస్తున్నారు.

ధరలు అపారంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వం తన వ్యయాన్ని అధికం చేసుకుటం మంచిదికాదని కొందరు అంటున్నారు.

పట్టణ ప్రాంతాల ప్రజల అసంతృప్తిని తొలగించటానికి ధరల స్థిరీకరణ మార్గమని అంటున్నారు. అందువల్ల ప్రభుత్వానికి అధిక వ్యయం పనికిరాదని అంటున్నారు.

ఆహార ఉత్పత్తికి సైనికుల వినియోగం

సింహళ ప్రభుత్వ నిర్ణయం

కొలంబో, జనవరి 22

ఆహార రంగంలో స్వయం సమృద్ధిని సాధించడానికి జరిగే పోరాటంలో 8200 మంది సైనికులను వినియోగించడానికి సింహళ ప్రభుత్వం నిర్ణయించింది.

గేదె పోయినది

పాడి గేదె దూడపోయినది. గుప్త బొమ్మి గేదెలో కురచరకం ఈనిమూడు నెలలు అయినది. ఆచూకీ తెలిసినవారు ఈ దిగువ అడ్రసును తెలిపిన తగిన బహుమతి ఇవ్వగలను.

ఇట్లు,
కొంపెల్ల సత్యనారాయణ
పెదకాపవరం (వయా ఆకివీడు),
ప॥ గో॥ జిల్లా.

ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ

వేలం ప్రకటన

నంద్యాల డివిజన్‌లోని, నంద్యాల వెలుగోడు, జి. బి యం రేంజిలలోని 1968 - 1969 సంవత్సరం టింబరు, వంట చెరకు, చిల్లర ఫలసాయం కూపులను 19 2 1968 వ తేదీ ఉదయం 11 గంటల నుండి నంద్యాల జిల్లా అటవీ కార్యాలయము వద్ద నంద్యాల జిల్లా అటవీ అధికారిచే బహిరంగముగా వేలం వేయబడును. వేలం వేయబడు కూపుల పూర్తి వివరములు, వేలం నిబంధనలు నంద్యాల జిల్లా అటవీ అధికారినుండి పొందవచ్చును.

(సం.) టి. కృష్ణమూర్తి,
జిల్లా అటవీ అధికారి,
నంద్యాల.

నూతన రైలుమార్గాలకై ప్రదేశ్ కమ్యూనిస్టు మహాసభ డిమాండ్

(1-వ పేజీ తరువాయి)

వృద్ధికి తీవ్ర ఆటంకాలేర్పడుతున్నాయి. మన రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అశ్రద్ధచేస్తోంది. నేడున్న రైల్వేలు రవాణా సౌకర్యాలకు ఎంత మాత్రం చాలవు

ఆంధ్ర ప్రజలు రైల్వేలు చాలవని ఒక వైపున ఆందోళన చేస్తూండే, రెండో వైపున ఉన్న రైల్వే మార్గాలనుకూడా (1) తెనాలి. రేపల్లె బ్రాంచిలైన్, (2) భీమవరం - నర్సాపురం బ్రాంచిలైన్ మొదలయినవి తీసివేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి ప్రభుత్వం యీ బ్రాంచి లైన్లను తొలగించే ప్రయత్నాలు విరమించుకొనాలి. ఎంత కాలంగానో ఆంధ్ర ప్రజలు కోరుతున్న యీ క్రింది క్రొత్త లైనులను వేయాలని యీ మహాసభ కోరుతోంది.

1. హైదరాబాద్‌నుండి నాగార్జునసాగర్ మీదుగా ఒంగోలును కలిపే బ్రాడ్‌గేజ్ లైను.
2. కొత్తగూడెంనుండి భద్రాచలం మీదుగా విశాఖపట్నం పోర్టును కలిపే లైను.
3. మైదుకూరు మీదుగా కడప-నెల్లూరు పట్టణాలను కలిపే లైను.
4. నిజామాబాద్ నుండి రామగుండాన్ని కలిపేలైను.

పై లైనులను నిర్మించడానికి పూనుకోవడంతోపాటు సౌత్ సెంట్రల్ రైల్వేలో చేర్చబడిన విజయవాడ డివిజన్ సరిహద్దులు 1-10-66న పూర్వంఉన్న మాదిరిగానే వుండాలి అదే విధంగా గుంతకల్లు డివిజన్‌ను రద్దు చేయాలనే తలంపును విడిచిపెట్టి, యీ గుంతకల్లు డివిజన్‌ను సౌత్ సెంటరల్ రైల్వేలో చేర్చాలి.

ఈ పైన పేర్కొన్న నూతన రైల్వే మార్గాల నిర్మాణం, తదితర మార్పులు చేయనిదే ఆంధ్ర పారిశ్రామిక, వ్యాపారాభివృద్ధికి తీరని ఆటంకాలేర్పడి, నిరుద్యోగ సమస్య యింకా తీవ్రతరమై ఆంధ్రప్రజలకు తీరని హాని కలుగుతుంది. అందువల్ల యీ సమస్యపై ఆంధ్ర ప్రజానీకం యావన్మంది ఒక్కుమ్మడిగా కదలి, పెద్ద ఉద్యమాన్ని నిర్మించి, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవడానికి పూనుకోవాలని యీ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

వ్యవసాయ కార్మిక వేతనాల హెచ్చింపుకు డిమాండ్

ప్రధానంగా వ్యవసాయిక రాష్ట్రమయిన ఆంధ్రప్రదేశ్ లో అసంఖ్యాక వర్గమయిన వ్యవసాయ కార్మికుల కనీస వేతనం విషయమై శ్రీ కొండ్రు సుబ్బారావు ప్రతిపాదించిన తీర్మానాన్ని సభ ఆమోదించింది

ఆ తీర్మానంలో ఇలా వున్నది:

ప్రాజెక్టులు, తదితర పథకాల ఫలితంగా, వ్యవసాయంలో కొంత అభివృద్ధి కనిపించినప్పటికీ, వ్యవసాయ కార్మికుల జీవిత పరిస్థితులు నేటికీ అతిదారుణంగా వున్నాయి తిండిగింజల ఉత్పత్తి పెరిగింది. ధరలు కొంచెం పెరిగాయి. కాని ఈ ఫలితాలన్నిటినీ భూస్వాములు, గ్రామీణ ధనిక వర్గాలు మాత్రమే స్వాహాచేస్తున్నారు. వ్యవసాయ కార్మికుని సగటు దినకూలి అప్పు దాదాపు 35 పైసలుగా మాత్రమే ఉంది. తెలంగాణా ప్రాంతంలో నేడు దినకూలి దాదాపు 75 పైసలు మాత్రమే. కోస్తా జిల్లాలలోని మాగాణి ప్రాంతాలలో సైతం రోజు కూలి 1.50 పైసలుగా మాత్రమే ఉంది. వ్యాపార పంటలను పండించే వ్యవసాయ కార్మికుల వేతనాలు సైతం ఇంతకంటే మెరుగుగా లేవు.

1962 లో ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అప్పటికి అమలులో ఉన్న రేట్లు లేక అంతకంటె తక్కువగానే ఉన్నాయి. కనుక అవి వ్యవసాయ కార్మికులకు ఎట్టి ప్రయోజనం కలిగించలేదు. ఆ పిమ్మట గ్రామీణ ప్రాంతాలలో ధరలు 60 శాతం పెరిగాయి, కాని వ్యవసాయ కార్మికుల వేతనాలు మాత్రం అందుకు తగినట్లుగా పెరగలేదు.

వ్యవసాయ కార్మికులకు కనీసం రెండు పూటల భోజనం, బట్టలు వసతి కలిగించే విధంగానైనా కనీస వేతనాలుండాలని ప్రదేశ్ కమ్యూనిస్టు మహాసభ డిమాండ్ చేస్తున్నది

వ్యవసాయ కార్మికుల దినసరి కూలి డెల్టా ప్రాంతంలో 9 శేర్ల ధాన్యం మెట్ట ప్రాంతాలలో 4 శేర్ల రాగులు,లేక అందుకు సమానమైన రొక్కంగాని ఉండాలని ప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం చేసిన డిమాండ్‌ను ప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ మహాసభ బలపరుస్తున్నది. అదే విధంగా పాలేరు జీతాలను సైతం సక్రమంగా నిర్ణయించాలి. వారికి వారాంతపు విశ్రాంతికాని, సెలవులుగాని తగు సౌకర్యాలు లేవనీ, రోజుకు చాలఎక్కువ గంటలు పని చేయవలసి ఉంటుందనే అంశాన్ని గుర్తించాలి. ఈ రేటు నిర్ణయం చేయాలి. డెల్టా ప్రాంతాలలో 32 బస్తాల ధాన్యం, మెట్ట ప్రాంతాలలో 12 లేక 15 బస్తాల రాగులు లేక అందుకు సమానమైన రొక్కం ఉండాలి అయిదేండ్ల కొకసారి ఈ వేతనాలను సవరించాలి. ప్రతిఏటా ధరల పెరుగుదలకు అనుగుణంగా ఈ రేటు దానంతటదే పెరుగుతూ ఉండాలి.

కనీస వేతనచట్టం ప్రాతిపదికపై వ్యవసాయ కార్మికుల వేతనాలను ప్రభుత్వం ఇక ఎక్కువ జాప్యం లేకుండా ప్రకటించాలని ఈ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నది.

శాసనసభ వద్దకు కూలిసంఘం నడపాలని ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చేసిన నిర్ణయాన్ని ఈ మహాసభ పూర్తిగా బలపరుస్తున్నది. సమాజంలో అట్టడుగున పడివున్న ఈ వ్యవసాయ కార్మికుల కోర్కెలను బలపరచవలసిందిగా ఇతర అన్ని వర్గాలను ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తున్నది.

ధాన్యం టోకు వ్యాపారాన్ని జాతీయం చేయాలి

నిత్యం అడ్డూ అదుపులేకుండా పెరిగిపోతున్న ధరల విషయమై శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ప్రతిపాదించిన తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది.

సభ ఆమోదించిన తీర్మానం ఇలా వుంది:

ప్రభుత్వ విధానాల ఫలితంగా సంక్షోభం తీవ్రమౌతున్నది. నోట్ల ముద్రణం, ధరల పెరుగుదలకు తోడ్పడుతున్నది. వస్త్రధారాలు, చింతపండు, కిరోసిన్‌వంటి జీవితావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. పాక్షిక డీ కంట్రోల్ ఫలితంగా బహిరంగమార్కెట్లో చక్కెర ధర బాగా పెరిగింది. పరిశ్రమాధిపతులు, బోగు వ్యాపారస్తుల లాభాపేక్షను తృప్తిపరచడానికే ప్రభుత్వం పై చర్యను చేపట్టింది. దిగుమతి గోధుమలపై సబ్సిడీని ప్రభుత్వం రద్దుచేసిన ఫలితంగా గోధుమ ధరకూడా పెరిగింది. రేషనింగ్ ప్రాంతాల్లో బియ్యంధరను ప్రభుత్వం పెంచింది. ధాన్యం పెరుగుదలకంటె ఈ పెరుగుదల చాలా హెచ్చుగా ఉంది. ప్రభుత్వ నిర్వహణఖర్చులు విపరీతంగా పెంచటం, ఏ పథకం లేకుండా బియ్యాన్ని ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి తరలించటం మొదలైన అవకతవక చర్యల ఫలితంగానే బియ్యం ధర కూడా పెరిగి పోయింది. ముఖ్యంగా వ్యాపారస్తులు ఒక పథకం ప్రకారం మరుం చిల్లర ధరలను పెంచి వేశారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు, పరిపాలనలోని అసమర్థత, ఈ ధరల పెరుగుదలకు కారణం.

ధాన్యంను జాతీయంచేసి సరుకు విల్వచేసే పద్ధతికి స్వస్తిచెప్పి, టోకు ధాన్య వ్యాపారాన్ని జాతీయంచేస్తే తప్ప ధరలను స్థిరపరచటం సాధ్యంకాదని ప్రదేశ్ కమ్యూనిస్టు మహాసభ స్పష్టం చేస్తున్నది ఈ చర్యలు తీసుకోటానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిరాకరిస్తున్న వాస్తవాన్ని మహాసభ గుర్తిస్తోంది.

రాష్ట్రంలోని అన్ని పట్టణాలలోను, రేషనింగ్ ప్రాంతాలలోను చౌక డిపోలను స్థాపించి బియ్యం, గోధుమ, పప్పుధాన్యాలు, చింతపండు, చక్కెర మొదలైన జీవితావసర వస్తువులను సరసమైన ధరలకు ప్రజలకు సప్లయి చేయవలసిందిగా ప్రభుత్వాన్ని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది. ఇతర పట్టణాలలోను రాష్ట్ర రాజధానిలోను, కొనసాగిన ధరల వ్యతిరేక ఉద్యమంపట్ల ప్రభుత్వం ప్రదర్శించిన వ్యతిరేకవైఖరిని మహాసభ గర్హిస్తున్నది ధరల నిరోధానికి నిరంతరం ఉద్యమం కొనసాగించేందుకు అన్ని ప్రజాతంత్ర వర్గాలు, పార్టీలు ప్రజాసంఘాలు సమైక్యం కావలసిందిగా ప్రదేశ్ కమ్యూనిస్టు మహాసభ విజ్ఞప్తి చేస్తున్నది

వీర వియత్నాం ప్రజకు విప్లవాభినందనలు

అమెరికన్ సామ్రాజ్యవాదులు జరుపుతున్న పైశాచిక దురాక్రమణ యుద్ధాన్ని అసమాన సాహసంతో ప్రతిఘటిస్తున్న వీర వియత్నాం ప్రజకు మహాసభ హృదయపూర్వక విప్లవాభివందనాలను అందజేసింది.

శ్రీ ఏటుకూరి బలరామమూర్తి ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు.

తీర్మానంలో ఇలా వుంది:

అకుంఠితదీక్ష, అజేయ ఆత్మవిశ్వాసం, సంపూర్ణ ఐక్యత ప్రదర్శిస్తోన్న వియత్నాం ప్రజలను, కాకలుతీరిన వారి మహోన్నత నేతృత్వాన్ని ఈ మహాసభ ప్రగాఢంగా శ్లాఘిస్తోంది. పవిత్ర జాతీయ విమోచన సమరాన్ని నిర్వహిస్తూ అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణదారులను బీరాలు పలికే వారి పైశాచిక యుద్ధయంత్రాంగాన్ని తీవ్ర పరాజయానికి గురిచేసి ఐక్య విప్లవోద్యమ ఇతిహాసములో మహాధ్యాయాన్ని సృష్టించి ప్రపంచ ప్రజలను ఉత్తేజపరిచింది వీర వియత్నాం ప్రజ

ఉత్తర వియత్నాం ప్రజాస్వామిక రిపబ్లిక్ తన సార్వభౌమాధికారాన్ని సగర్వంగా నిలబెట్టుకుంటూ అమెరికా సామ్రాజ్యవాదుల పాశవిక దురాక్రమణను త్రిప్పికొడుతూ నిరంతరం చురుకుగా సోషలిస్టు నిర్మాణాన్ని కొనసాగిస్తున్నది.

సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టు దేశాల ఆర్థిక, సాంకేతిక సహాయం అందజేస్తూ, ప్రదర్శిస్తోన్న సంఘీభావం, వలంటీర్లను పంపేందుకు సంకల్పించడం, అవసరమైన ఏ యితర సహాయమైనా అందించడానికి సిద్ధంగా వుండటం వియత్నాం ప్రజల విప్లవ పోరాటానికి ఎనలేని బలాన్ని చేకూర్చి వీరి అంతిమ లక్ష్యాన్ని మరింత చేరువ చేసింది.

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ 11 వ మహాసభ వీరవియత్నాం ప్రజల పోరాటానికి జోహారు అర్పిస్తూ నికృష్టమైన అమెరికా దురాక్రమణ దారులను నికరంగా ఖండిస్తూంది. వియత్నాం పోరాటానికి అన్నివిధాలా సహాయ సంపత్తులను అందజేస్తున్న సోవియట్ యూనియన్ ఇతర సోషలిస్టు దేశాలకు హార్దికాభినందనలు ఈ మహాసభ అందజేస్తూంది. వియత్నాం సమస్యపై ఉమ్మడి కార్యాచరణకై సోవియట్ తదితర సోషలిస్టు దేశాలు చేసిన విజ్ఞప్తిని యీ మహాసభ పూర్తిగా బలపరుస్తూంది

అమెరికాలో నేడు పుంజుకుంటున్న సామ్రాజ్యవాద యుద్ధ వ్యతిరేక ఉద్యమానికి ఈ మహాసభ అభివాదం చేస్తూంది. ఈ ప్రధాన సమస్యపై భారత ప్రభుత్వం అనుసరిస్తున్న రాజీ ధోరణిని తీవ్రంగా ఖండిస్తూంది. ఉత్తర వియత్నాంపై అమెరికా బాంబుదాడులను వెంటనే ఆపివేయాలని అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ దళాలను ఉపసంహరించాలని, దక్షిణ వియత్నాంనుండి అమెరికన్ సైనిక స్థావరాలు వైదొలగాలని, దక్షిణ వియత్నాం ప్రజా ప్రతినిధిగా జాతీయ విమోచన సంఘటనను గుర్తించాలని, 1954 జెనీవా ఒప్పందాల ప్రాతిపదికపై వియత్నాం సమస్యను శాంతియుతంగా పరిష్కరించవలెనని యీ మహాసభ డిమాండు చేస్తున్నది

వియత్నాం పోరాటానికి సానుభూతి సహాయాలందజేసే ఉద్యమాన్ని ఉధృతం చేయవలసిందిగా అన్ని పార్టీ శాఖలను, సభ్యులను సానుభూతిపరులను యీ మహాసభ ఆదేశిస్తున్నది. రాష్ట్రంలోని సామ్రాజ్యవాద వ్యతిరేకులు ప్రజాస్వామ్యవాదులు శాంతికాములు యీ మహోన్నత లక్ష్యసాధనలో భాగస్వాములు కావలసిందిగా యీ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

పార్టీ కార్యకలాపాల నివేదిక ఆమోదం

పార్టీ కార్యకలాపాలు, ప్రజారంగాలు నివేదికపై జరిగిన చర్చ సారాంశాన్ని శ్రీ [illegible] రెడ్డి వివరించిన అనంతరం కొన్ని సవరణలతో మహాసభ ఆ నివేదికను ఆమోదించింది.

కొసిగిన్‌తో విల్సన్ చర్చలు ప్రారంభం

మాస్కో, జనవరి 22

మాస్కో రావడంతోనే బ్రిటిష్ ప్రధాని విల్సన్ నేడు కొసిగిన్‌తో సంభాషణలు ప్రారంభించారు.

క్రెమ్లిన్‌భవనంలో ఈ చర్చలు జరిగాయి. విమానాశ్రయంలో విల్సన్‌కు కొసిగిన్ స్వాగతం చెప్పారు.

విల్సన్ మాస్కో పర్యటనవల్ల ఫలితం శూన్యం

(విశాలాంధ్ర విలేకరి)

మాస్కో, జనవరి 22

పౌండ్ విలువ తగ్గింపుతోపాటు తన ప్రతిష్ఠనుకూడా కోల్పోయిన బ్రిటిష్ ప్రధాని విల్సన్ సోవియట్ ప్రభుత్వంతో జరిపే చర్చలవల్ల ప్రయోజనం శూన్యమని మాస్కోలోని విశాలాంధ్ర ప్రత్యేక విలేకరి వ్రాస్తున్నారు.

విల్సన్ చర్చలవల్ల అంతర్జాతీయ సమస్యల పరిష్కారం విషయంలో గణనీయమయిన ప్రయోజనం వుంటుందని మాస్కో వర్గాలు భావించటంలేదు వియత్నాంలో, అలాగే ఇతర ప్రాంతాల్లో జాన్సన్ దురాక్రమణ విధానానికి పూర్తి మద్దతు ఇచ్చే విల్సన్‌పై అది దాదాపు అమెరికన్ సామ్రాజ్యవాదుల వెలరినెసోలి వుంటుందనటంలో సందేహంలేదు జాన్సన్ మాటలే బహుశా విల్సన్ నోటినుంచి వినిపిస్తాయి

తన ఆర్థికవ్యవస్థ దివాలాస్థితిలో పడిన దృష్ట్యా, సోవియట్ యూనియన్‌తో ఆర్థిక సంబంధాల అభివృద్ధికోసం విల్సన్ ఈ సందర్భంలో ప్రయత్నించవచ్చునని తెలుస్తోంది.

వియత్నాం, పశ్చిమాసియా పరిస్థితి, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధకఒప్పందం వగైరా అంశాల మీద విల్సన్-కొసిగిన్‌ల మధ్య చర్చలు జరుగుతాయి

ఈ చర్చలు బ్రిటన్ సోవియట్ యూనియన్‌ల మధ్య సహకారానికి తోడ్పడగలవని, యూరప్ భద్రతకు ఉపయోగపడగలవని సోవియట్ పార్టీ పత్రిక ప్రావ్దా నేడు ఆశాభావం వెలిబుచ్చింది.

EDUCATIONAL

"Account Test . Andhra Pradesh for Executive Officers, Subordinate Officers Parts: I, II; P.W.D- Headmasters & Deputy Inspectors' Tests & Zilla Parishad Tests. Postal Tuition Offered Questions / Answers & Summaries also available for above Tests.

For Free Prospectus Apply to :
ACCOUNT TEST INSTITUTE-
MADRAS-8."

భారత దేశములో ఎక్కువగా ప్రజాదరణ పొందిన డిపకో డీసెల్ ఇంజన్



సిసిల్ (ఇండియా) సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
పోస్ట్ బాక్స్ నెం. 362, బొంబాయి-1

PEARL/PUB SIS/3-C TSE

"అతివాద" కమ్యూనిజం: ఒక బాలారిష్టం

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ మహాధినేత, మహామహోపాధ్యాయుడు, సోవియట్ రాజ్య నిర్మాత రచించిన ఈ మౌలిక గ్రంథం ఆ రోజుల్లో అనేకమంది కమ్యూనిస్టులను పట్టుకుపీడిస్తున్న అతివాద, ఒంటెత్తు దుస్సాహసిక ధోరణులను అతి నిశితంగా దుయ్యబట్టింది. మార్క్సిస్టు వ్యూహాన్ని, ఎత్తుగడలను అది బహు చక్కగా వివరిస్తున్నది. వర్తమాన సజీవ ప్రాధాన్యం కలిగిన గ్రంథం అది.

పేజీలు 160, వెల : రు. 0-60

పోస్టేజి అదనం : ప్రతులకు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ-2
విశాలాంధ్ర బుక్‌హౌస్, సుల్తాన్ బజారు, హైదరాబాద్

ADMARK

SOVIET TEXT BOOKS

SCIENCE & TECHNOLOGY

ONLY METRIC SYSTEM USED

Popular Prices

Most of them Prescribed or Recommended by the INDO - SOVIET Text Book Board

Theoretical Physics	Kompaneyets	Pp	560	10-80
The Structure of Atoms and Molecules	Kondratyev		544	8-40
Hand book of Elementary Physics	Koshkin		214	4-25
Introduction to Physics	Kitaigorodsky		719	9-60
Theory of Elasticity	Filonenko - Borodich		378	7-20
Quantitative Analysis	Alexeyev		491	8-40
Organic Chemistry	Pavlov and Terentyev		592	8-40
Text book of General Chemistry	Nekrasov		480	7-20
Higher Mathematics	Suvorov		310	7-20
Problems in Mathematical Analysis	Demidovich		400	7-20
General Geology	Lange		300	5-40
Reclamative Social Science	Ryvanin		393	7-20
General Metallurgy	N. Sevryukov & others		545	7-00
Metallurgist's Hand book	A. Group of authors		224	6-50
Fundamentals of Electrical Engineering	M. Kuznetsov		460	7-20
Power Stations and Substations	L. Baptidanov & V. Tarasov		452	7-20
Mine Electrician	Y. Mikheyev & Fadbizovich		465	7-20
Materials for Electrical Engineering	B. M. Tarayev		200	5-40
Electric Slag Welding	B. Paton		355	7-20
Heat Treatement of Metals	B. Zacharov		311	-50
Heat Treatement	Kamenichny		275	3-60
Production of Ferro Alloys	[illegible]		687	2-00
Open Hearth Practice	Bornatsky		340	7-20
Gas Welding & Cutting	Glizmanenko		430	7-20
Materials Handling Equipment	Rudenko		335	7-20
Building Construction Drawing	P. Barasukov		302	6-00
Conveyers and Related Equipment	V. Dyachkov & V. Spivakovsky		375	7-20
Structural Design of Sea Going Ships	N. Barabanov		454	7-20
Marine Power Plant	P. Akimov		530	8-40
Marine Auxiliary Machinery and Systems	M. Khetagurov		493	7-20
Mathematical Control Machines	A. Lasktov		380	7-20
Essentials of Crystallography	Y. Flint		226	-40
A Course of Mineralogy	A. Betekhtin		643	9-60

POSTAGE EXTRA

Place your orders with

VISALAANDHRA PUBLISHING HOUSE,
Eluru Road centre : : VIJAYAWADA - 2.
VISALAANDHRA BOOK HOUSE,
Sultan Bazar : : HYDERABAD.

ADMARK



మంజులా వారి
చిత్రం

రేపే
ప్రారంభం!
(ఉదయం ఆటతో)

నిలువు దోపిడీ

వినోదమే ప్రధానమైన
ఒక అపూర్వ హాస్యరసమయ
చిత్రం...

ఇందలి పాత్రలు, సన్నివేశాలు కేవలం కల్పితాలు

నిర్మాత... U.విశ్వేశ్వరరావు, B.Sc; దర్శకత్వం... C.S.రావు, B.A.(Litt) సంగీతం... K.V.మహదేవన్
ఆంధ్ర:- జ్యోతి పిక్చర్స్, సీడెడ్:- జయలక్ష్మి పిక్చర్స్, నైజాం:- దివ్యదత్త ఫిలింస్
గుంటూరు జిల్లాకు హక్కుదారులు: మహారాజా సిండికేట్, తెనాలి (జ్యోతి రిలీజ్) తూర్పు గోదావరి జిల్లాకు హక్కుదారులు:- నిర్మలా పిక్చర్స్, గుడివాడ (జ్యోతి రిలీజ్)

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. ప్రధాన సంపాదకుడు ఏటుకూరు బలరామమూర్తి. ముద్రణ: స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-4.